హామీలతో ఆకాశం
అందంగా పూస్తుంది
దించలేక అధికారం
దిగులుతో చూస్తుంది.
ఆర్థికం రెక్కలుడిగి
అది లేవని రాష్ట్ర పక్షి
పన్నులేసి ఇక బాధుడే
ప్రజల్లోన మౌన సాక్షి

చురక



-వేల్పుల నారాయణ
9440433475

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 13-2-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:152 పేజీలు:6 వెల: రూ.1/-


## జడ్పీ సీఈవోలు, డిప్యూటీ సీఈవోలతో సహా 105 మంది అధికారులు బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 12: తెలంగాణలో ప్రభుత్వ అధికారుల బదిలీల కొనసాగుతున్నది. పంచాయతీరాజ్‌శాఖలో పని చేస్తున్న 105 మంది అధికారులను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారుల్లో జడ్పీ సీఈవోలు, డిప్యూటీ సీఈవోలతో పాటు జిల్లా పంచాయతీ అధికారులను బదిలీ అయ్యారు.

సొంత జిల్లాల్లో పని చేస్తున్న వారితో పాటు మూడేళ్లకుపైగా ఒకేచోట పని చేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈసీ మార్గదర్శకాల మేరకు ప్రభుత్వం అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది.ఇదిలా ఉండగా.. పంచాయతీరాజ్‌శాఖతో పాటు ఎక్సైజ్ శాఖ అధికారులను సైతం ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది.

రాష్ట్రవ్యాప్తంగా 14 మంది జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులను బదిలీ చేస్తూ ఎక్సైజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ ఆదేశాలు జారీ చేశారు.

# తెలంగాణ సమాజాన్ని కేసీఆర్ అవమానిస్తున్నారు

### - ప్రతిపక్ష నాయకుడిగా పద్మారావుకు బాధ్యతలు ఇవ్వాలి
### -మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి విమర్శల వర్షం



హైదరాబాద్( ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కృష్ణానది మీద ఉన్న ప్రాజెక్టుల నిర్వహణను కేఆర్ఎంబీకి అప్పగించే ప్రసక్తేలేదంటూ రాష్ట్ర అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెట్టింది. ఈ తీర్మానంపై చర్చలో అధికార, విపక్షాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. " ఈ రోజు అదే పాలమూరు జిల్లాకు సంబంధించిన కృష్ణా నది జలాల మీద చర్చ జరుగుతుంటే ఆ మహానుభావుడు (కేసీఆర్) ఇక్కడకు రాకుండా ఫామ్‌హౌస్‌లో ఉన్నాడు. ఈ రోజు తెలంగాణ సమాజాన్ని కేసీఆర్ అవమానిస్తున్నారు. ఇంతకంటే కీలకమైన అంశం ఈ తెలంగాణ ఏమైనా ఉందా?. కృష్ణానది జలాలలో పరివాహక ప్రాంతం ప్రకారం 68 శాతం వాటా నీళ్లు తెలంగాణకు ఇవ్వాలని ఒక ప్రత్యేక తీర్మానం తీసుకొచ్చినప్పుడు హూందాగా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు వచ్చి ఇక్కడ కూర్చొని ఈ తీర్మానానికి మద్ధతు పలికి.. తెలంగాణ హక్కుల మీద, నీళ్ల మీద ఒకే మాట మీద నిలబడ్డామని ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్ర ప్రభుత్వం వరకు ఒక సందేశాన్ని పంపాల్సిన సమయం, సందర్భంలో సభకు రాకుండా ఫామ్‌హౌస్‌లో దాక్కొని ప్రజలను తప్పుదోవ పట్టించడానికి మిగతావారిని పంపించి వచ్చి అబద్దాలు ఆడిపిస్తున్నారు. "తెలంగాణ సమాజానికి నీళ్లు ప్రాణప్రదాయిని. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలోని మహబూబ్ నగర్, రంగారెడ్డి, నల్లగొండ, ఖమ్మం వరకు కృష్ణా నది జలాల మీదనే ఆధారపడి జీవితాలు కొనసాగిస్తున్నాం. మహబూబ్ నగర్ జిల్లా నుంచి 10 లక్షలకు పైగా మంది వలసలు వెళ్లి తట్టపని, పారపని, మట్టిపని, బొగ్గుపనుల కోసం వలసలు వెళ్లారు. ఇందుకు కారణం ఒక వ్యక్తి. కరీంనగర్ ప్రజలు తరిమికొడితే అక్కడి నుంచి పారిపోయి పాలమూరు జిల్లాకు వలస వస్తే అయ్యోపాపం అని వలస వచ్చారని ఆదరించి ఎంపీగా గెలిపిస్తే అటే పోయారు" అంటూ మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు.

ప్రతిపక్ష నాయకుడిగా పద్మారావుకు బాధ్యతలు ఇవ్వాలి

"ఏదేమైనా మొన్న నేను చూసినప్పుడు ఆ కుర్చీ ఖాళీగా ఉంది. ఈ రోజు ఆ కుర్చీలో పెద్దలు పద్మారావు కూర్చున్నారు. వారికి ఆ బాధ్యత ఇస్తే వారన్న నెరవేరుస్తారు. దయచేసి ప్రతిపక్ష నాయకుడిగా పద్మారావుకు బాధ్యతలు ఇవ్వాలి. పద్మాగారు నిజమైన తెలంగాణ ఉద్యమకారుడు. తెలంగాణ కోసం కొట్లాడేవారు. వారి లాంటివాళ్లను పెడితే తెలంగాణ సమాజానికి మేలు జరుగుతుంది. మొత్తంగా కృష్ణానది మీద ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతను కేఆర్ఎంబీకి అప్పగించే ప్రశక్తే లేదు. తెలంగాణ వాటా నీళ్ల రాష్ట్రానికి ఇవ్వాల్సిందే" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

## చంచల్ గూడ జైల్లో అనుమానాస్పద స్థితిలో ఓ ఖైదీ మృతి

హైదరాబాద్ ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): చంచల్ గూడ జైల్లో అనుమానాస్పద స్థితిలో ఓ ఖైదీ మృతి చెందాడు. కిస్మత్ పూర్‌కు చెందిన ముడావత్ రాజును గత నాలుగు రోజుల క్రితం రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. గుడిలో దొంగతనం చేసిన కేసులో ముడావత్ రాజు, శ్రీనులు నిందితులుగా ఉన్నారు. వారెంట్ ఉండడంతో రాజును పోలీసులు అదుపులోకి తీసుకొని చంచల్ గూడ జైల్‌కు తరలించారు. సోమవారం ఉదయం రాజు చనిపోయాడంటూ అతని కొడుకుకు పోలీసులు ఫోన్ చేశారు. దీంతో రాజు మృతిపై పలు అనుమానాలు ఉన్నాయంటూ కుటుంబ సభ్యులు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రాజు మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# చెప్పుతో కొట్టినట్టు ప్రజల తీర్పు...

### -కోమటిరెడ్డికి హరీష్ రావు మధ్య మాటల యుద్ధం



హైదరాబాద్ ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నల్లగొండ ప్రజలు బీఆర్ఎస్‌ను చెప్పుతో కొట్టినట్టు తీర్పు ఇచ్చారని ఇచ్చారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 2 నెలల కిందట జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ స్వల్ప ఓట్ల డిపాజిట్ దక్కించుకోగలిందని విమర్శించారు. అలాంటి పార్టీ నాయకుడు ఏ మొహంతో నల్లగొండలో సభ పెడతారని ప్రశ్నించారు. " నల్లగొండ జిల్లా ముందు మా జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని వ్యాఖ్యానించారు.కాగా 'అమేథిలో రాహుల్ గాంధీని చెప్పుతో కొట్టారని మేము కూడా అనొచ్చు' అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. చెప్పుతో కొడతామని అన్న పదాన్ని అసెంబ్లీ రికార్డుల నుంచి డిలీట్ చేయాలని స్పీకర్‌ను హరీశ్ రావు కోరారు.

# నీటి ప్రాజెక్టులపై సభలో చర్చ

### -ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీష్ రావుల మధ్య మాటల యుద్ధం
### - అపోజిషన్ పార్టీ లీడర్ సభలో లేకుండా ఫామ్ హౌస్‌లో పడుకున్నారు:సిఎం
### -రేవంత్ రెడ్డి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది: హరీష్ రావుల



హైదరాబాద్ ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. గత ప్రభుత్వ తప్పిదాలను అధికార కాంగ్రెస్ పార్టీ ఎత్తి చూపుతోంది. అందుకు ధీటుగా ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ సమాధానం ఇస్తోంది. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీష్ రావుల మధ్య సోమవారం అసెంబ్లీలో మాటల యుద్ధం జరిగింది. నీటి ప్రాజెక్టులపై ఈరోజు సభలో చర్చ జరుగుతోంది. దీనిలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం జరిగిందే నీళ్ల కోసమని, అలాంటి చర్చ సందర్భంగా అపోజిషన్ పార్టీ లీడర్ కేసీఆర్ సభలో లేకుండా ఫామ్ హౌస్‌లో పడుకున్నారని, కరీంనగర్ ప్రజలు తరిమితే మహబూబ్ నగర్ వచ్చారని ఏద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యాలపై హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమం గురించి రేవంత్ రెడ్డి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించడం అవుతుందన్నారు. కోడంగల్ ప్రజలు తరిమితే మల్కాజ్‌గిరి వచ్చారంటు కౌంటర్ ఇచ్చారు.నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనెజ్ మెంట్ బోర్డుకు (కెఆర్ఎంబీ) అప్పగించడాన్ని బీఆర్ఎస్ పార్టీ తప్పుపడుతుంది. 13వ తేదీ మంగళవారం రోజున ఛలో నల్లగొండకు బీఆర్ఎస్ పార్టీ పిలుపు నిచ్చింది. ఆయకట్టు రైతులు, ప్రజలు భారీగా తరలి రావాలని కోరింది. అక్కడ నిర్వహించే సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగిస్తారు. అదే రోజు మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళతారు. ఒకే రోజు అధికార, విపక్షాలు ప్రాజెక్టుల అంశంపై మాటల యుద్ధానికి దిగుతున్నాయి

## ప్రకృతి పర్యావరణాన్ని రక్షిద్దాం: ప్రకృతి ప్రజా కవి జయరాజ్ పిలుపు

హైదరాబాద్ ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); ప్రకృతిని పర్యావరణాన్ని రక్షించడానికి జర్నలిస్టులు సైతం కలిసి రావాలని ప్రకృతి ప్రజా కవి గాయకుడు డాక్టర్ జయరాజ్ పిలుపునిచ్చారు. జయరాజ్ పుట్టినరోజును పురస్కరించుకొని జర్నలిస్టులు ఆయనకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జయరాజ్ మాట్లాడుతూ ప్రకృతికి విరుద్ధంగా జీవిస్తూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నామని తద్వారా ప్రజలు తమ ఆరోగ్యాన్ని కోల్పోతున్నారని తెలిపారు. పేపర్ ప్లేటు, గ్లాసు, ప్లాస్టిక్ బ్యాగులకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. శిలా నీవే, శిల్పి నీవే, శిల్పం నీవే అనే అద్భుతమైన సందేశాత్మక తత్వ గీతాన్ని ప్రజలకు అందించినందుకు డాక్టర్ జయరాజు అన్నని జర్నలిస్టులు అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు దినపత్రిక ఎడిటర్ గుమ్మడి హరిప్రసాద్, ధరణి దినపత్రిక ఎడిటర్ జి రోజా రాణి, నేత్రం దినపత్రిక ఎడిటర్ ఇంద్రపాల సత్యనారాయణ, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీకి రాని కెసిఆర్ నల్గొండకు ఎలా వెళ్తారు - డిప్యూటీ సిఎం భట్టి



హైదరాబాద్, ఫిబ్రవరి 12: అసెంబ్లీకి రాని వ్యక్తి మంగళవారం నల్గొండలో వెళ్తావా అంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం అసెంబ్లీలో కృష్ణా జలాలపై చర్చ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. కృష్ణా జలాలపై అసెంబ్లీలో చర్చించి కేంద్ర ప్రభుత్వానికి తీర్మానం చేసి పంపాలని కోరితే ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి రాలేదని విమర్శించారు . అసెంబ్లీకి రాని వ్యక్తి రేపు బహిరంగ సభకు వెళ్తారా అంటూ నిలదీశారు. బీఆర్ఎస్ ఈఎన్సీ మురళీధరరావు బిఆర్ఎస్ కు అనుకూలంగా మాట్లాడారని ఆరోపించారు. పదివే విరమణ చేసినా పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కొనసాగించారని విమర్శించారు. కృష్ణా జలాలపై చర్చ సందర్భంగా హరీశ్ రావు సభను తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో చాలా మంది బీఆర్ఎస్ ఏజెంట్లు ఉన్నారని? వారిపై త్వరలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈఎన్సీ మురళీధరరావు చేత బీఆర్ఎస్ తమకు అనుకూలంగా మాట్లాడించిందని ఆయన ఆరోపించారు. రిటైర్ అయినప్పటికీ ఆయనను పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిందని విమర్శించారు.

ఆంధ్రప్రదేశ్‌లో రేయింబవళ్లు పనులు జరుగుతుంటే గత ప్రభుత్వం ప్రశ్నించలేదని అడిగారు. శ్రీశైలంలో ఫ్లడ్?లైట్లు పెట్టి మరీ పనులు చేసిందని తెలిపారు. గోదావరి జలాలు, శ్రీశైలంలో మన భూభాగాలున్నాయని వాటి కోసం ఒప్పందాలు చేసుకున్నాం అనడం అర్థరహితం అన్నారు. తెలంగాణ నీళ్ల కోసమే పుట్టిందని, వాటి కోసమే పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నామని పేర్కొన్నారు. కనీసం ఇప్పుడైనా ఆ నీటిని సమర్ధవంతంగా వాడుకోవడానికి ప్రయత్నం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం అడుగుతుంటే గతంలో జరిగినవి మళ్లీ గుర్తు చేసుకుని రాష్ట్రానికి అన్యాయం చేయకూడదని కోరారు.

## గాంధీ ఆసుపత్రి ఆవరణలో హెల్ టాటామని చారిటబుల్ ట్రస్ట్ అన్న దానం



హైదరాబాద్ ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);హెల్ టాటామని చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యం లో సోమవారం సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రి ఆవరణలో పేదలు, రోగి సహాయకులకు అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్ టాటామని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కాకుమాను జ్యోతి మాట్లాడుతూ అన్నిదానములకన్న అన్నదానం గొప్పని, ఆకలితో అలమటించే వారికి పట్టెడన్నం పెట్టి వారి ఆకలి తీర్చడం లో ఉన్న తృప్తి మరెందులో ఉండదన్నారు. ఈ సందర్భంగా సుమారు 250 మంది పేదలకు అన్నదానాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమం లో హెల్ టాటామని చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## శాంతించిన రిటైల్ ద్రవ్యోల్బణం.. తగ్గిన ఆహార ధరలు..!

హైదరాబాద్, ఫిబ్రవరి 12: రిటైల్ ద్రవ్యోల్బణం కాసింత శాంతించింది.

2023 డిసెంబర్ నుంచి 2024 జనవరి నాటికి రిటైల్ ద్రవ్యోల్బణం 5.7 శాతం నుంచి 5.10 శాతానికి దిగి వచ్చిందని నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) తెలిపింది. ఇది మూడు నెలల కనిష్టం. ఆర్బీఐ కీలక రెపోరేటు 6.5 శాతం కొనసాగిస్తూ వరుసగా ఆరోసారి నిర్ణయం తీసుకున్న కొన్ని రోజులకు ప్రకటించిన రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం గమనార్హం.

ద్రవ్యోల్బణం ఆధారిత ధరల సూచీ (సీపీఐ) డిసెంబర్ నెలలో 5.62 శాతం ఉంటే, 2024 జనవరిలో 6.52 శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో సీపీఐ 5.34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 4.92 శాతానికి దిగి వచ్చింది.

నగటున జనవరి రిటైల్ ద్రవ్యోల్బణం 5.10 శాతంగా నమోదైంది. గత ఆగస్టు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 6.83 శాతంతో గరిష్టాన్ని తాకింది. ఆహార ద్రవ్యోల్బణం గత డిసెంబర్ నెలలో 9.53 శాతం ఉంటే, జనవరిలో 8.3 శాతం గా నమోదైంది.

నేటి కందం- నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

పలు విధములుగా- పలు చ
ర్చలు జరుగగ రాజధాని-చక్కగ నాంగ్లే
యులచే కరినగరమునకు
కలకత్తా పురము నుండి కదిలించ బడెన్



(13-2-1931 దేశ రాజధాని కలకత్తా నుండి ఢిల్లీకి మార్చబడింది)

-రాధశ్రీ
సెల్:9494481210

# మారిశస్ ప్రధానితోను మరియు శ్రీలంక అధ్యక్షునితోను కలసి యుపిఐ సేవలను ప్రారంభించిన ప్రధాన మంత్రి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:శ్రీ లంక లో మరియు మారిశస్ లో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) సర్వీసుల ను మరియు మారిశస్ లో రూపే కార్డు సేవల ను కూడా శ్రీ లంక అధ్యక్షుడు శ్రీ రణిల్ విక్రమ సింఘె, మారిశస్ ప్రధాని శ్రీ ప్రవింద్ జగన్నాథ్ లతో కలసి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న వీడియో కాన్ఫరెన్సింగ్ మాధ్యం ద్వారా ప్రారంభించారు.

కో-బ్రాండెడ్ రూపే కార్డు కు మారిశస్ లో డమెస్టిక్ కార్డు గా పేరుపెట్టడం జరుగుతుంది అని మారిశస్ ప్రధాని శ్రీ ప్రవింద్ జగన్నాథ్ తెలియ జేశారు. ఈ రోజు న ప్రారంభించుకొంటున్న ఈ కార్డు తో రెండు దేశాల పౌరుల కు ఎంతో సౌకర్యం లభిస్తుంది అని ఆయన అన్నారు.

అయోధ్య ధామ్ లో శ్రీ రామ మందిరం యొక్క ప్రాణ ప్రతిష్ఠ కు గాను శ్రీ లంక అధ్యక్షుడు శ్రీ రానీల్ విక్రమ సింఘె ప్రధాన మంత్రి కి అభినందనల ను తెలియ జేశారు. శతాబ్దాల తరబడి గా ఉన్నటువంటి ఆర్థిక సంబంధాల ను గురించి ఆయన ఈ సందర్భం లో నొక్కి చెప్పారు. రెండు దేశాల మధ్య కనెక్టివిటీ యొక్క గతి ని కొనసాగించడం తో పాటు సంబంధాల ను గాఢతరం చేసుకోవడం ఇక ముందు కూడా ఇలాగే కొనసాగుతూ ఉంటుంది అనేటటువంటి ఆశ ను ఆయన వ్యక్తం చేశారు. ఈ సందర్భం లో ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, మూడు మిత్ర దేశాలు.. భారతదేశం, శ్రీ లంక, మరియు మారిశస్.. లకు ఈ రోజు ఒక ప్రత్యేకమైనటువంటి రోజు అని చెప్తూ, వాటి మధ్య గల చరిత్రాత్మక సంబంధాలు ఆధునిక డిజిటల్ సంధానం రూపాన్ని సంతరించుకొన్నాయి అన్నారు. ప్రజల కు అభివృద్ధి ఫలాల ను అందించే దిశ లో ప్రభుత్వం యొక్క నిబద్ధత కు ఇది రుజువు అని ఆయన అన్నారు. ఫిన్‌టెక్ కనెక్టివిటీ సరిహద్దుల కు ఆవల లావాదేవీల ను మరియు సంబంధాల ను పెంపొందింప చేస్తుంది అని ఆయన స్పష్టం చేశారు. "భారతదేశం యొక్క యుపిఐ లేదా యునైటెడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ఈ రోజు న ఒక క్రొత్త భూమిక తో ముందుకు వస్తున్నది; అదే, యునైటింగ్ పార్ట్ నర్స్ విద్ ఇండియా " అని ప్రధాన మంత్రి నొక్కి చెప్పారు.

డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనేది భారతదేశం లో ఒక విప్లవాత్మకమైన మార్పు ను తీసుకు వచ్చింది. దీనిలో పాలుపంచుకొనే మారుమూల పల్లెల లోని అతి చిన్న విక్రయదారులు కూడాను యుపిఐ మాధ్యం ద్వారా లావాదేవీల ను జరుపుతున్నారు. వారు డిజిటల్ చెల్లింపుల ను చేస్తున్నారు అని పేర్కొన్నారు. యుపిఐ లావాదేవీల సౌలభ్యాన్ని మరియు వేగాన్ని గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, కిందటి సంవత్సరం లో 2 లక్షల కోట్ల రూపాయల లేదా 8 ట్రిలియన్ శ్రీ లంక రూపాయల లేదా ఒక ట్రిలియన్ మారిశస్ రూపాయల విలువ కలిగిన 100 బిలియన్ కు పైచిలుకు లావాదేవీ లు యుపిఐ మాధ్యం ద్వారా జరిగాయి అని వివరించారు. జెఇఎమ్ ద్వారా వరుస లో ఆఖరి వ్యక్తి వరకు సేవల ను అందించడం జరుగుతోంది అని ప్రధాన మంత్రి అన్నారు; జెఇఎమ్ త్రయం అనేది ఒకటి: బ్యాంకు ఖాతా, రెండు: ఆధార్ మరియు మూడు: మొబైల్ ఫోన్ లను సూచిస్తుంది. ఈ మార్గం లో 34 లక్షల కోట్ల రూపాయల ను (ఇది 400 బిలియన్ యుఎస్ డాలర్ విలువ కు సమానం) లబ్ధిదారుల యొక్క బ్యాంకు ఖాతాల లోకి బదలాయించడం జరిగింది. ప్రపంచం లో అతి పెద్దది అయినటువంటి టీకా మందు ను ఇప్పించే కార్యక్రమాన్ని భారతదేశం కోవిన్ (అనీచితిని) ప్లాట్ ఫార్మ్ ద్వారా అమలు పరచింది అని ప్రధాన మంత్రి తెలిపారు. "సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించడం అనేది పారదర్శకత్వాన్ని ప్రోత్సహిస్తూ, అవినీతి ని తగ్గిస్తూ, సమాజం లో అన్ని వర్గాల వారి ని కలుపుకొని ముందుకు సాగిపోతూ ఉండడాన్ని పెంచుతున్నది" అని ప్రధాన మంత్రి అన్నారు." 'పొరుగు దేశాల కు ప్రాధాన్యం' అనేది భారతదేశం యొక్క విధానం అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు; మా సముద్ర సంబంధి దృష్టికోణం సాగర్ (ఎస్ఎజిఎఆర్), అంటే.. సెక్యూరిటీ ఎండ్ గ్రోథ్ ఫార్ ఆల్ ఇన్ ద రీజియన్ కు సంకేత చిహ్నం. భారతదేశం తన అభివృద్ధి ని తన ఇరుగు పొరుగు దేశాల అభివృద్ధి నుండి వేరు చేసి చూడదు." అని ఆయన అన్నారు.శ్రీ లంక అధ్యక్షుడు కిందటి సారి సందర్శన కు వచ్చిన సందర్భం లో, ఆమోదించినటువంటి విజన్ డాక్యుమెంటు ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, ఫినాన్శియల్ కనెక్టివిటీ ని బలపరచడం ఆ పత్రం లోని కీలకాంశం అని ప్రముఖం గా ప్రకటించారు. ప్రధాని శ్రీ ప్రవింద్ జగన్నాథ్ తో కూడా ఆయన జి-20 సమిట్ లో విశిష్ట అతిథి గా పాల్గొన్నందువల్ల ఈ విధమైన చర్చల ను జరపడమైంది అని ప్రధాన మంత్రి అన్నారు.యుపిఐ తో జత పడడం అనేది శ్రీ లంక కు మరియు మారిశస్ కు ప్రయోజనకారి కాగలదు అనే విశ్వాసాన్ని ప్రధాన మంత్రి వ్యక్తం చేశారు. దీని వల్ల డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేశన్ కు దన్ను లభిస్తుంది, స్థానిక ఆర్థిక వ్యవస్థ లు సకారాత్మకమైన మార్పున కు నోచుకొంటాయి; పర్యటన రంగాని కి ప్రోత్సాహం లభిస్తుంది అని ఆయన అన్నారు. "యుపిఐ తో ముడిపడి ఉన్న ప్రదేశాల కు వెళ్ళేందుకు భారతీయ పర్యటకులు ప్రాధాన్యాన్ని ఇస్తారని నేను నమ్మకం తో ఉన్నాను. శ్రీలంక లో నివసిస్తున్న భారతీయ మూలాలు కలిగిన వ్యక్తులు మరియు అక్కడ చదువుకొంటున్న విద్యార్థులు కూడా దీని ద్వారా ప్రత్యేక ప్రయోజనాల ను అందుకొంటారు" అని ప్రధాన మంత్రి అన్నారు. నేపాల్, భూటాన్, సింగపూర్, గల్ఫ్ లో యుఎఇ ల తరువాత ప్రస్తుతం ఆఫ్రికా లో మారిశస్ నుండి రూపే కార్డు ను ప్రారంభించడం జరుగుతున్నది. ఇది మారిశస్ నుండి భారతదేశాని కి విచ్చేసే ప్రజల కు కూడా సౌకర్యవంతం గా ఉంటుంది. నగదు ను కొనుగోలు చేయవలసిన అవసరం సైతం తగ్గుతుంది. యుపిఐ మరియు రూపే కార్డు వ్యవస్థ లు మన సొంత కరెన్సీ లో చెల్లింపుల ను జరుపుకొనే సౌలభ్యాన్ని తక్కువ ఖర్చు లో వాస్తవ కాల ప్రాతిపదిక న వీలు కల్పిస్తాయి. రాబోయే కాలం లో, మనం సరిహద్దు ఆవల జరపవలసిన చెల్లింపుల ను పర్సన్ టు పర్సన్ (పి2పి) చెల్లింపు సదుపాయం పద్ధతి కి మారవచ్చును అని ప్రధాన మంత్రి వివరించారు.

ఈ రోజు న ప్రారంభించుకొన్న సౌకర్యాలు గ్లోబల్ సౌథ్ (వికాస శీల దేశాల) సహకారం తాలూకు సాఫల్యాన్ని సూచిస్తున్నాయి అని ప్రధాన మంత్రి అన్నారు. "మన సంబంధాలు లావాదేవీల కు మాత్రమే పరిమితమైనవి కావు, అవి చరిత్రాత్మకమైనటువంటి సంబంధాలు" అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. మూడు దేశాల ప్రజల మధ్య పరస్పర సంబంధాలు శక్తివంతం గా మారాయి అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నొక్కి చెప్పారు.

# సకల జనులకు 'ఆకాశవాణి'తో అవిభాజ్య సంబంధం

**(13 ఫిబ్రవరి "ప్రపంచ రేడియో దినం" సందర్భంగా)**

2011లో యునెస్కో సూచన మేరకు 2012లో ఐరాస సర్వసభ్య సమావేశం తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 13 ఫిబ్రవరిన సభ్య దేశాలు "ప్రపంచ రేడియో దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. 13 ఫిబ్రవరి 1946న ఐరాస కేంద్ర కార్యాలయంలో యూఎన్ రేడియో ప్రారంభమైన విషయాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి ఏట 13 ఫిబ్రవరిన వరల్డ్ రేడియో డే జరుపుకోవడం ఆచారంగా మారింది. రేడియో ప్రాధాన్యాన్ని ప్రజలకు అవగాహన పరుస్తూ, రేడియో ద్వారా ప్రపంచ విశేషాలను ప్రజల ముంగిట చేర్చుతూ, ప్రజలకు విలువైన సమాచారాన్ని దరికి చేర్చే, ప్రపంచ శాంతి పరిరక్షణ, అంతర్జాతీయ సమన్వయ సాధనకు మాధ్యమంగా రేడియోను నిలుపు ఉద్దేశంతో ప్రపంచ రేడియో దినం నిర్వహిస్తున్నారు. 1890ల్లో "గుగ్లియల్మో మార్కొని" కనుగొన్న రేడియో లేదా వైర్‌లెస్ టెలిగ్రాఫ్ 1895లో నిర్దిష్ట కార్యరూపం దాల్చి వార్తలను సుదూర తీరాలకు చేరవేసే సాధనంగా ప్రపంచ మానవాళి ముందు నిలిచి నేటికీ మన మనసులను దోచుకుంటూనే ఉన్నది.

### రేడియో బహుళ ప్రయోజనాలు:

సమాచార వితరణలో అగ్రస్థానం రేడియో ఆక్రమించింది. ప్రజాస్వామ్య పరిరక్షణ, వైవిధ్య భరిత మానవీయ సేవలు, ఆధ్యాత్మిక సందేశాలు, వివిధ వృత్తుల పట్ల అవగాహనలు, సాగు తీరుతెన్నులు, వినోద విజ్ఞాన కార్యక్రమాలు, ప్రముఖుల ప్రసంగాలు, ప్రభుత్వ పథకాల వివరణలు, ప్రజలను సమయానుకూలంగా చైతన్య పరచడం, వివిధ సంస్థల పనితీరులు, ప్రజారోగ్య సమాచారాలు, జాతీయ అంచర్జాతీయ తాజా వార్తలు విశేషాలు, సంగీత సాహిత్య వేదికలు, విద్యా బోధనలు, ఆటపాటలు, నాటకీయ కార్యక్రమాలు, అత్యవసర వాతావరణ సమాచారాలు, అవసర విపత్తు హెచ్చరికలు, పేదరిక నిర్మూలన బాధ్యతలు, సంక్షేమ కార్యక్రమాలు, సమ్మిళిత సమగ్రాభివృద్ధి తీరుతెన్నులు, సమైక్య భావన సుగంధాల వితరణలు లాంటి అనేక ప్రజాప్రయోజన కార్యక్రమాలను వంటింటి వరకు చేర్చే శ్రవణ మాధ్యమంగా రేడియో సామాన్యుల హృదయాలకు సమీపంగా ఉంటూ వస్తున్నది.

### శతాబ్దానికి పైగా అవిశ్రాంత సేవలు:

ప్రపంచ రేడియో దినం – 2024 నినాదంగా "రేడియో : ఏ సెంచరీ ఇన్‌ఫార్మింగ్, ఎంటర్‌టేనింగ్ అండ్ ఎడ్యుకేటింగ్" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతుంది. డిజిటల్ యుగంలో కూడా రేడియో సామాన్యులను విడిచి ఉండలేదు. టీవీలు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, లడస్మార్ట్‌ఫోన్లు లాంటి ఎన్ని రకాల ఎలక్ట్రానిక్ ఉపకరణాలు వచ్చిన రేడియో ప్రాధాన్యం నేటికి చెక్కు చెదరలేదు. ఎఫ్ ఎం (ఫ్రీక్వెన్సీ మాడ్యులేషన్) రేడియో అందుబాటులోకి రావడంతో నేటి డిజిటల్ యుగంలో కూడా రేడియో ప్రధాన ప్రసార మాధ్య మంగా ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం పదిలపరుచుకుంది.

అనంత వార్తావిశేషాల మూటలను మన ఇంటికి చేర్చుతున్న రేడియోను మన ఆత్మీయ నేస్తంగా, సకల జనుల అవిభాజ్య హితవరిగా ఆదరిస్తూ విజ్ఞాన వివేకాలను సొంతం చేసుకుందాం.

– డా౹౹ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# రోడ్డుభద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించి, చైతన్యం తేవాలి: జిల్లా కలెక్టర్




ఖమ్మం, ఫిబ్రవరి 12:(నేటినిజం ప్రతినిధి): రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించి,చైతన్యం తేవాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. సోమవారం కలెక్టర్, మధిర పట్టణం రెడ్డి గార్డెన్స్ వద్ద జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు–2024 పురస్కరించుకుని, రోడ్డు భద్రతపై కళాజాత బృందం ద్వారా ప్రచారం చేపట్టి, ప్రజల్లో అవగాహనకు ఏర్పాటు చెందిన రోడ్డు భద్రతా చైతన్య రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ బి.శంకర్, మధిర తహసీల్దార్ వెంకటేశ్వర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీలు వస్తే ప్రతీ ఏటా నోటిఫికేషన్స్: మంత్రి బొత్స

విజయవాడ ఫిబ్రబవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఉపాధ్యాయ నోటిఫికేషన్ ద్వారా నియామకాలు పూర్తి అయితే జీరో వేకెన్సి అవుతుం దని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ఖాళీలు వస్తే ప్రతీ ఏటా నోటిఫికేషన్‌లు జారీ చేస్తామని.. ఇ-బ.జీజూ.ఐనీల.తిని/ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు దాఖలు చేయొచ్చునని తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏపీలో 6,100 ఖాళీలు మాత్రమే ఉన్నాయన్నారు. పార్లమెంటులో చెప్పిన ఖాళీల విషయం సత్యదూరమని, ఏపీ నుంచి ఖాళీల వివరాలు కేంద్రానికి ఇవ్వలేదంటూ పార్లమెంట్‌లో ఇచ్చిన సమాధానాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ తప్పు పట్టారు.

# కర్ణాటకలోని మైసూరులో ఈరోజు జరిగిన సుత్తూరు జాతర మహోత్సవంలో పాల్గొన్న కేంద్ర హోంమంత్రి, సహకార మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: కర్ణాటకలోని మైసూరులో ఈరోజు జరిగిన సుత్తూరు జాతర మహోత్సవం లో కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా పాల్గొన్నారు. మహోత్సవంలో శ్రీ అమిత్ షా తో పాటు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీ అమిత్ షా తన ప్రసంగంలో నిస్వార్థ సేవ, పనికి ప్రాధాన్యత, దాతృత్వం అనే మూడు సూత్రాలకు సుత్తూరు మఠం కేంద్రంగా ఉంది అని అన్నారు. శతాబ్దాలుగా సుత్తూరు మహాసంస్థానం మఠానికి పీఠాధిపతులుగా పని చేసిన 24 మంది సాధువులు సేవా, యాగం సంప్రదాయాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్నారని దీంతో ఈ మఠానికి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది అనుచరులు ఉన్నారని తెలిపారు. సుత్తూరు మఠం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు.

ఫిబ్రవరి 6 నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ ఉత్సవం దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పునరుజ్జీవింప చేయడానికి సహకరిస్తుందని కేంద్ర హోం మంత్రి తెలిపారు. మహోత్సవంలో భాగంగా రథోత్సవం, తెప్పోత్సవం, సామూహిక వివాహాలు పాటు అనేక ఉత్సవాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. పండుగ సందర్భంగా వ్యవసాయ జాతర, కుస్తీ, సంప్రదాయ ఆటలు కూడా నిర్వహిస్తామని, ఒక విధంగా సామాజిక జీవితంలో అన్ని అంశాలను కలుపుకొని ఉత్సవం జరుగుతుందని తెలిపారు.

జగద్గురువులు శ్రీ శివరాత్రి దేశికేంద్ర మహాస్వామి సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్తూ ఎన్నో పనులు అమలు చేస్తున్నారని శ్రీ అమిత్ షా అన్నారు. ఈ మఠం పరిధిలో సుమారు 350 విద్యాసంస్థలు ఉన్నాయని, 20 వేల మందికి పైగా పనిచేస్తున్నారని, వాటిలో లక్ష మందికి పైగా విద్యార్థులు విద్య నేర్చుకుంటున్నారు అని శ్రీ షా వివరించారు. ఈ మఠం దేశంలోనే ప్రత్యేక ప్రాముఖ్యత సంతరించుకున్న దివ్యాంగుల విద్యార్థుల కోసం పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌ని స్థాపించిందని శ్రీ ప్రశంసించారు. 900 మందికి పైగా ప్రత్యేక సామర్థ్యం ఉన్న విద్యార్థులు ఈ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుతున్నారని శ్రీ షా చెప్పారు. జనవరి 22న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అయోధ్యలో శ్రీరాముని విగ్రహాన్ని ప్రతిష్ఠించారని కేంద్ర హోం మంత్రి తెలిపారు. సుత్తూరు మఠం శాఖ కూడా అయోధ్యలో ఏర్పాటు అవుతుందని తెలిపారు.

'' భారతదేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు, గౌరవం తీసుకు వచ్చారు " అని శ్రీ అమిత్ షా అన్నారు.

అయోధ్యలో రామ మందిరం, కాశీలో కాశీ విశ్వనాథ్ కారిడార్, మహాకాల్ కారిడార్, బాబా కేదార్‌నాథ్, బద్రీ ధామ్ పునరుద్ధరణ వంటి అనేక సాంస్కృతిక కేంద్రాలను ప్రధాని మోదీ పునరుద్ధరించారని ఆయన వివరించారు. దేశాన్ని సురక్షితంగా, సుసంపన్నంగా మార్చడంతో పాటు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ యోగా, ఆయుర్వేదం, భాషలను పరిరక్షించడానికి అనేక చర్యలు తీసుకున్నారని శ్రీ షా అన్నారు.

# దేశంలో 128 నగరాల్లో ఫిబ్రవరి 20 నుంచి మార్చి 7 వరకు నిర్వహించే పరీక్షకు హాజరు కానున్న 48 లక్షల మంది అభ్యర్థులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (అంఖఈ)లో కానిస్టేబుళ్ల నియామకం కోసం కానిస్టేబుల్ (ఉఆ) ప్రవేశ పరీక్ష మొదటిసారిగా హిందీ, ఇంగ్లీష్ కాకుండా 13 ప్రాంతీయ భాషలలో జరగనున్నది దేశంలో 128 నగరాల్లో 2024 ఫిబ్రవరి 20 నుంచి మార్చి 7 వరకు జరిగే పరీక్షలకు 48 లక్షల మంది అభ్యర్థులు హాజరవుతారు.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలో కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) పరీక్షను 2024 జనవరి 1నుంచి ఇంగ్లీష్, హిందీతో పాటు 13 ప్రాంతీయ భాషలలో నిర్వహించాలని నిర్ణయించింది. కేంద్ర సాయుధ పోలీసు దళంలో స్థానిక యువత భాగస్వామ్యాన్ని పెంచడానికి, స్థానిక భాషలను ప్రోత్సహించడానికి కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా చొరవతో ఈ చారిత్రాత్మక నిర్ణయం అమలులోకి వచ్చింది.

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ూాఅ) నిర్వహిస్తున్న ముఖ్యమైన పరీక్షల్లో కానిస్టేబుల్ ఉఆ పరీక్ష ఒకటి, దీనికి దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువత హాజరవుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని . హిందీ, ఇంగ్లీషుతో పాటు పైన పేర్కొన్న 13 ప్రాంతీయ భాషలలో పరీక్షలు నిర్వహించడానికి హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. దీని ప్రకారం, ూాఅ కానిస్టేబుల్ (ఉఆ) పరీక్ష 2024 ను ఇంగ్లీష్, హిందీతో పాటు 13 ఇతర ప్రాంతీయ భాషలలో నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

కేంద్ర హోం శాఖ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల లక్షలాది మంది యువత తమ మాతృభాష/ప్రాంతీయ భాషలో పరీక్షకు హాజరు కావడానికి, ఎంపికయ్యే అవకాశాలను మెరుగుపరచడానికి వీలు కల్పిస్తుంది.ఫలితంగా దేశవ్యాప్తంగా ఎక్కువ మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరు కావడానికి అవకాశం కలుగుతుంది. ప్రతి ఒక్కరికి సమాన ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న యువత తమ మాతృభాషలో సీఏపీఎఫ్ కానిస్టేబుల్ ( జనరల్ డ్యూటీ ) ఎంపిక పరీక్ష రాయగలుగుతారు. మాతృభాషలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే పరీక్షల్లో ప్రతిభ కనబరచి దేశ సేవ కోసం సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ లో చేరడానికి ఎక్కువ మందికి అవకాశం లభిస్తుంది.

# సంపద సృష్టిస్తున్న బీసీ కులాలకు బడ్జెట్ కేటాయింపులో అరకొర నిధులు

## – సామాజిక స్ఫూర్తికి విరుద్ధం.. బీసీ సేన నిప్పులు

హైదరాబాద్ ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);బడ్జెట్ కేటాయింపులో




అరకొర నిధులు కేటాయించడం సామాజిక స్ఫూర్తికి విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరించిందని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ విమర్శించారు. విద్యానగర్ లోని అంబేద్కర్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ మాది వాస్తవిక బడ్జెట్ అని చంకలు గుద్దుకుంటున్న రాష్ట్ర ముఖ్యమంత్రి , 60 శాతం జనాభాగలబీసీలకు కేవలం ఎనిమిది వేల కోట్లు కేటాయిస్తే సరిపోతుందా ఇదేనా ప్రజలు కోరుకున్న మార్పు అని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో కామారెడ్డి నియోజకవర్గం లో బీసీ డిక్లరేషన్ సభలో అధికారంలోకి వస్తే ప్రతి ఏటా వార్షిక బడ్జెట్ లో బీసీల అభివృద్ధికి 20 వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం నాడు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ వార్షిక బడ్జెట్ కేవలం ఎనిమిది వేల కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్న రాష్ట్ర ప్రభుత్వం , ఏడాదిపాటు బీసీల అభివృద్ధికి, బీసీ గురుకులాల భవన నిర్మాణాలకు ఏ మూలకు సరిపెపోదని రాష్ట్ర తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, ఉపకార వేతనాలు మరియు ఫీజు రియంబర్మెంట్ బకాయిలతోపాటు, ఇచ్చిన హామీ మేరకు 20 వేల కోట్ల అదనపు. బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేసారు.

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ కేంద్రంలో కోటి రూపాయల నిధులతో పూలే భవన్ నిర్మించాలని కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానేహామీలతోనే బీసీల్ల లాక్కోవాలని చూస్తే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీసీలు అధికార పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో కరాటే ఎతినే చెన్నయ్య, వెంకటేష్ యాదవ్, బాలస్వామి, సెలేటి వెంకటేష్,గౌడుగు నర్సిములు, రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ, జనసేనదే సూపర్ సిక్స్! ఆరు పథకాలతో ఆదుకుంటాం - నారా లోకేష్

అమరావతి, ఫిబ్రవరి 12: ఉత్తరాంధ్రాకు పట్టిన శని ఈ సీఎం జగన్.. ఉత్తరాంధ్రలో సాగునీరు లేదు, తాగునీరు లేదు.. పెండింగ్ ప్రాజెక్టుల్లోఒక్క పని కూడా చేపట్టలేదు. మూడు రాజధానుల పేరిట మూడు ముక్కలాట ఆడుతున్నారని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. శంఖారావం పేరిట ఉత్తరాంధ్రలో పర్యటిస్తున్నారు. రెండో రోజు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో సోమవారం శంఖారావం సభ జరిగింది. ఈ సభలో లోకేష్ మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లాలో రోడ్లు నిర్మించాం.. ఆసుపత్రులు నిర్మించాం.. ఉద్దానంలో బాధితులకు డయాలసిస్ సదుపాయం కల్పించాం.. కానీ జగన్ ప్రభుత్వం ఉత్తరాంధ్రను పట్టించుకోలేదని మండిపడ్డారు. నరసన్నపేట నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ ఒక్కపని కూడా చేపట్టలేదని, ఆయన పేరులోనే ధర్మాన ఉంది.. కానీ ఆయన అధర్మ ప్రభువు అని ధ్వజమెత్తారు.



### వాటర్ ప్రాజెక్టులు చేపడుతాం..

అంగన్‌వాడీల నియామకం కావొచ్చు.. షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగాలు కావొచ్చు అన్ని అమ్మేసుకున్నారని లోకేష్ ఆరోపించారు. నియోజకవర్గంలో చెరువులు, భూములు వేటినీ వదిలి పెట్టలేదన్నారు. భూకబ్జాలే అధర్మ ఆలోచన అని విమర్శించారు. వంశధార, తోటపల్లి కుడి ఎడమ కాలువల పనులు పూర్తి చేస్తానని, తోటపల్లి కరకట్ట నిర్మిస్తానని తన పాదయాత్రలో జగన్ హామీ ఇచ్చారని.. ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. మరో 60 రోజుల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని.. అధికారంలోకి వచ్చిన వెంటనే తోటపల్లి కరకట్టపనులు, బొంతు ఎత్తిపోతల ప్రాజెక్టు చేపడుతామని లోకేష్ హామీ ఇచ్చారు.

### మూడు రాజధానుల పేరుతో మోసం..

మూడు రాజధానుల పేరిట జగన్ మోసం చేశారని, శ్రీకాకుళం జిల్లా ప్రజల అవసరాలను తీర్చలేదన్నార. కానీ 500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నారని విమర్శించారు. షుగర్ ఫ్యాక్టరీలను తెరుస్తామని హామీ ఇచ్చారని, ఒక్క ఫ్యాక్టరీని తెరవలేదన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు.. కానీ, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు జగన్ సిద్ధపడ్డారని.. తన ఆస్తులు పెంచుకునేందుకు యత్నిస్తున్నాడని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చెప్పారు. అవసరమైతే ఆంధ్రులే విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఇద్దరికే ఉత్తరాంధ్ర ధారాదత్తం.. ఉత్తరాంధ్రాను ఇద్దరికి ధారదత్తం చేశారని, ఒకరు విజయసాయి రెడ్డి, మరకొరు ఎస్వీ సుబ్బారెడ్డికి అప్పగిస్తే భూకబ్జాలకు పాల్పడుతున్నారని లోకేష్ ఆరోపించారు. ఇక జగన్ ప్రజల రక్తం తాగేస్తున్నారని, క్వార్టర్ మందుతాగిన వ్యక్తి నుంచి రూ.25లు జే ట్యాక్స్ పేరుతో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలా ఏటా 45 వేల కోట్ల రూపాయాలను జేబులో వేసుకొంటున్నారన్నారు. మద్యపాన నిషేధం అమలు చేస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు జేబు ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మద్యం తయారు చేసేది, బాటిల్ నిపేది, అమ్మించేది ఆయనే అన్నారు. వైన్ షాపులకు టార్గెట్ ఇచ్చేది జగనే అని మండిపడ్డారు. మరో అరవై రోజుల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని, బాబు సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని, రైతులకు ఏటా రూ.20వేలు, ఐదేళ్లల్లో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగాలు వచ్చేవరకూ నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని, మహిళలకు ఉచితంగా ఆర్టీసీప్రయాణ సదుపాయం కల్పిస్తామని లోకేష్ హామీలు కుమ్మరించారు. సభలో శ్రీకాకుళం ఎంపీ కింజరపు రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి డా౹౹ జితేంద్ర సింగ్‌తో భేటీ అయిన మిజోరాం ముఖ్యమంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:ప్రస్తుతం దేశ రాజధానిలో పర్యటిస్తున్న మిజోరాం ముఖ్యమంత్రి శ్రీ లాల్‌దూ హోమ్మా, ఆదివారం న్యూఢిల్లీలో కేంద్ర శాస్త్రడ సాంకేతిక శాఖ (ఇండిపెం డెంట్ ఛార్జి) సహాయమంత్రి, పిఎంఒ, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్లు, అణు ఇంధనం, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డా. జితేంద్ర సింగ్ ను మర్యాదపూర్వకంగా కలుసుకుని, రాష్ట్రంలో సివిల్ సర్వెంట్లు ఇతర అధికారుల నియామకం సహా రాష్ట్రానికి సంబంధించి అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యల గురించి చర్చించారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈశాన్య ప్రాంతానికి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తారని, ఈ ప్రాంతంలోని ఎనిమిది రాష్ట్రాలలోనూ సమాన అభివృద్ధిని నిర్ధారించేందుకు ఎంతో ఆసక్తితో ఉన్నారని డా. జితేంద్ర సింగ్ ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ ఈశాన్య రాష్ట్రాలలో 65సార్లు పర్యటించారని, ఆయనకు ముందు ఉన్న ప్రధానులందరూ చేసిన పర్యటనల మొత్తం కన్నా బహుశ ఇది ఎక్కువే ఉండవచ్చని అన్నారు. మిజోరాం చాలా చిన్న రాష్ట్రమైనప్పటికీ, ప్రధానమంత్రి మోడీ అప్పుడప్పుడు రాష్ట్రంలో పర్యటించి, అక్కడ అభివృద్ధి ప్రాజెక్టులను, కార్యక్రమాలను ప్రారంభిస్తున్నారని ఆయన తెలిపారు.

ఇజ్రాయెలీ సహకారంతో మోడీ ప్రభుత్వం మిజోరాంలో మొత్తం ఉపఖండంలో మొదటి విశిష్టకేంద్రాలలో ఒకటైన ప్రత్యేకమైన నిమ్మజాతి పళ్ళ పార్క్‌ని ఏర్పాటు చేసిన విషయాన్ని డా. జితేంద్ర సింగ్ గుర్తు చేసుకున్నారు. ఇది ఉద్యానవనాలను పెంపొందించి, ఈ ప్రాంతంలో ఆదాయం, ఉపాధి కల్పిస్తుందని ఆయన అన్నారు.

సివిల్ సర్వెంట్ల నియామకాలకు బాధ్యత వహించే డిఒపిటికి ఇన్చార్జిగా ఉన్న డా. జితేంద్ర సింగ్‌ను రాష్ట్రంలో సివిల్ సర్వెంట్లను, అధికారుల నియామకం గురించి శ్రీ లాల్‌దూహోమ్మా విజ్ఞప్తి చేశారు. ఈ విషయమైన అధికారిక సమాచారాన్ని ఇవ్వవలసిందిగా ముఖ్యమంత్రికి సూచిస్తూ, సాధ్యతను పరిగణించి, తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# శివయ్య సన్నిధిలో విదేశీ భక్తులు..

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: దక్షిణ కాశి శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రాహుకేతు పూజలు, రుద్రాభిషేకాలు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనార్థం విచ్చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామి అమ్మవార్ల దర్శనార్థం రావడంతో ఆలయ అధికారులు, పాలక మండలి అధ్యక్షుని సూచనతో స్వామి అమ్మవార్ల దర్శనార్థం విచ్చేసిన భక్తులకు కంచుగడప వద్ద ఎస్పీఎఫ్ సిబ్బంది, అధికారులు సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ప్రతి సోమవారం రాహుకాలం సమయంలో పూజలు చేసుకోవడం కోసం రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా.. వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి భక్తులు రావడం రోజుకు పెరుగుతుంది. సిబ్బంది వ్యవహార శైలి కూడా మెరుగుపడిందని, దళారులకు అడ్డుకట్ట వేసి సామాన్య భక్తుల సేవలో తరించడం సేవాభావం చూపుతున్నారు.

స్వామివారి సన్నిధిలో ఇటలీ దేశస్తులు..

శివయ్యకు అత్యంత ప్రీతివంతమైన రోజు సోమవారం కావడంతో ఆయన జన్మ నక్షత్రంగా భక్తులు శివయ్యను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. దోష నివారణ పోవాలంటే దేశంలో రాహుకేతు పూజల నివారణ జరగాలంటే అది శ్రీకాళహస్తి ఆలయం మాత్రమే.. కావున ప్రపంచ నలుమూలల నుంచి దోషాలు తొలగించుకునేందుకు ఆలయానికి విచ్చేస్తుంటారు. సోమవారం ఇటలీ దేశానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలు నిర్వహించుకుని స్వామి అమ్మవార్ల దర్శనం, శివయ్య సన్నిధిలో వారి మతపెద్దలు భక్తులను ఆశీర్వదించడం అభినందనీయమని రాష్ట్రంలో ముఖ దేవాలయమైన తిరుమల, తర్వాత శ్రీకాళహస్తి అని, ఇలాంటి దైవ సన్నిధిలో మనం జన్మనించడం పూర్వజన్మ సుకృతమని స్థానిక భక్తులు హర్షిస్తున్నారు.



# బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ రెండో విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య

సూర్యాపేట ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్ బి);సూర్యాపేట మండలం ఇమాంపేట గ్రామంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న వైష్ణవి అనే విద్యార్థిని హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు సూర్యాపేటలోని 9వ వార్డులోగల ఎన్టీఆర్ కాలనీ వాసిగా తోటి విద్యార్థినిలు తెలిపారు. విద్యార్థిని ఆత్మహత్య సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కాగా, వైష్ణవి మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, నిజనిర్ధారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆమె కుటుంబసభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. ఆ మేరకు గురుకుల పాఠశాల ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. అదేవిధంగా సూర్యాపేట పెన్ పహాడ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దాంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

# ఎవరూ కలిసిరాకపోయినా ఫర్వాలేదు.. ఆప్‌పై ప్రకటనపై ఖర్గే వ్యాఖ్యలు..!

న్యూ డిల్లీ ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రతిపక్ష ఇండియా కూటమిలోని పార్టీలు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు వరుస షాక్‌లు ఇస్తున్నాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని ప్రకటించాయి. పంజాబ్, ఛండీగఢ్ లోక్‌సభ స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేయనున్నట్లు అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ శనివారం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, భగవంత్ మాన్ ప్రకటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. పంజాబ్‌లో ఒంటరిగా పోటీ చేయాలని కాంగ్రెస్ హైకమాండ్ మాట్లాడడం ఇదే తొలిసారి. లూధియానా జిల్లాలోని సమ్రాలాలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎన్నికల్లో మాట్లాడుతూ పలువురు నేతలు ఆప్‌తో పొత్తు పెట్టుకోవద్దని పంజాబ్‌కు చెందిన పలువురు నేతలు హైకమాండ్‌కు తెలిపారు. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ మాత్రమే నష్టపోవాల్సి వస్తుందని అభిప్రాయపడ్డారు. మోదీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ఇండియా కూటమి సిద్ధమవుతోందని మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఎక్కడా సమన్యాయం జరగడం లేదు.. పోరాడాల్సిందేనని కాంగ్రెస్ కార్యకర్తలు అర్థం చేసుకోవాలని సూచించారు.ఒంటరిగా పోరాడాలని.. చివరి వరకు పోరాడి విజయం సాధించాలన్నారు. ఎవరైనా వచ్చినా ఫర్వాలేదు.. రాకపోయినా ఫర్వాలేదన్నారు. దేశవ్యాప్తంగా ఈ నిర్ణయం తీసుకున్నామని.. ఇది కేవలం పంజాబ్‌కు సంబంధించినది కాదన్నారు. గట్టిగా పోరాడాలంటూ మల్లికార్జున్ ఖర్గే కాంగ్రెస్ కార్యకర్తలకు గెలుపు మంత్రోపదేశం చేశారు. కాంగ్రెస్ గెలవాలంటే కార్యకర్తలు రంగంలోకి దిగాలన్నారు. ప్రజలను కలవాలని.. వారి అపోహలు తొలగిపోవాలన్నారు. ముందుగా ప్రజలు మధ్యలోకి వెళ్లాలని.. వారితో మాట్లాడాల్సి ఉంటుందని.. తాము ఏం చేశామో.. మోదీ ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలకు చెప్పాలన్నారు.

# నల్గొండ జిల్లాకు కేసీఆర్ చేసిందేమి లేదు

## -నల్గొండ జిల్లాను బీఆర్ఎస్ ప్రభుత్వం సర్వ నాశనం చేసింది
## -కేసీఆర్ ముక్కు నేలకు రాసి నల్గొండ రావాలి : మంత్రి కోమటిరెడ్డి డిమాండ్



నల్గొండ ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: నల్గొండ జిల్లాకు మాజీ సీఎం కేసీఆర్ చేసిందేమి లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. నేడు నల్గొండలో కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ... నల్గొండ జిల్లాను బీఆర్ఎస్ ప్రభుత్వం సర్వ నాశనం చేసిందన్నారు. కేసీఆర్ ముక్కు నేలకు రాసి నల్గొండ రావాలన్నారు. ఎస్ఎల్‌బీసీని కుర్చీ వేసుకొని పూర్తి చేస్తానన్న కేసీఆర్ మాట తప్పాడన్నారు. సభ రోజు నల్గొండలో ప్రజలకు క్షమాపణ చెప్పాకే కేసీఆర్ ప్రసంగించాలని కోమటిరెడ్డి అన్నారు.కేసీఆర్ మాట తప్పడంపై నల్గొండ టౌన్‌లో సభ రోజు వినూత్న నిరసన చేస్తామని తెలిపారు. కేసీఆర్ కోసం చైర్, పింక్ టవల్ ఎల్ఈడి స్క్రీన్ పోలీసు పర్మిషన్‌తో పెడతామని కోమటిరెడ్డి తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ ప్రజాపయోగ్యమైందన్నారు. కేఆర్ఎంబీ ఫైళ్లపై సంతకం పెట్టిందే కేసీఆర్, హరీష్ రావు అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అప్పులకు కూడా బడ్జెట్ కేటాయించామన్నారు. కాళేశ్వరం మేడిగడ్డపై చర్చ వేదికలో అందరూ పాల్గొనాలని కోమటిరెడ్డి తెలిపారు.

# లోక్‌సభ ఎన్నికలకు సన్నాహకాలు ప్రారంభించిన తెలంగాణ బీజేపీ

## -బలమైన అభ్యర్థులు లేని చోట చేరికలను ప్రోత్సాహించాలని నిర్ణయం
## -ఈటల రాజేందర్ ఎక్కడ నుంచి పోటీచేయాలనే దానిపై ఉత్కంఠ



హైదరాబాద్ ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ బీజేపీ సన్నాహకాలు ప్రారంభించింది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల కమిటీ బీజేపీ కార్యాలయంలో సమావేశం అయింది. ఈ భేటీలో కిషన్‌రెడ్డితోపాటు లక్ష్మణ్, డీకే అరుణ, జితేందర్ రెడ్డి, మురళీధరరావు, ఈటల రాజేందర్, ఇన్చార్జ్ అరవింద్ మీనన్ తదితరులు సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల కమిటీ ఒక్కో స్థానం నుంచి మూడు పేర్ల అధిష్ఠానానికి పంపనుంది. కాగా ఇప్పటికే ఒకసారి ఢిల్లీలో బీజేపీ ఎన్నికల కమిటీ సమావేశమైంది. సిట్టింగ్ స్థానలపై స్పష్టతకు వచ్చింది.సికింద్రాబాద్ నుంచి కిషన్ రెడ్డి, కరీంనగర్.. బండి సంజయ్, నిజామాబాద్.. ధర్మపురి అరవింద్, చేవెళ్ల.. కొండా విశ్వేశ్వరరెడ్డి, భువనగిరి.. బూర నర్సయ్య గౌడ్ పేర్లు దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈటల రాజేందర్ ఎక్కడ నుంచి పోటీచేయాలనే దానిపై ఉత్కంఠ నెలకొంది. మల్కాజ్‌గిరి స్థానం నుంచి పోటీకి ఆయన ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. అయితే మెదక్ లేదా జహీరాబాద్ నుంచి పోటీ చేయాలని ఈటలకు బీజేపీ నాయకత్వం సూచిస్తోంది. మల్కాజ్‌గిరి సీటు చాడా సురేష్ రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, పన్నాల హరీష్ రెడ్డి, మల్కా కొమరయ్య, మురళీధరరావు ఆశిస్తున్నారు.మరోవైపు మహబూబ్‌నగర్ సీటు కోసం డీకే అరుణ, జితేందర్ రెడ్డి, శాంతికుమార్ పోటీపడుతున్నారు. నగర్ లోక్ సభ స్థానం కోసం పార్టీలో ఉన్న ముఖ్యనేతల మధ్య పోటీ నెలకొంది. ఖమ్మం టికెట్ రేసులో ఈవీ రమేష్, గల్లా సత్యనారాయణ, రంగా కిరణ్, వాసుదేవరావులు ఉన్నారు. బలమైన అభ్యర్థులు లేని చోట చేరికలను ప్రోత్సాహించాలని బీజేపీ నిర్ణయించింది.

# 395 మంది ఎంపీడీవోల బదిలీ..ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్ ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణలో అధికారుల బదిలీల పర్వం కొనసాగుతున్నది. నిన్న డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లను బదిలీ చేసిన ప్రభుత్వం తాజాగా ఎంపీడీవోలను బదిలీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ పరిధిలో సేవలందిస్తున్న 395 మంది ఎంపీడీవోలను ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సొంత జిల్లాల్లో పని చేస్తున్న వారితో పాటు మూడేళ్లకుపైగా ఒకేచోట పని చేస్తున్న ఉద్యోగులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలని గతేడాది డిసెంబర్‌లో ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈసీ మార్గదర్శకాల మేరకు ప్రభుత్వం 395 మంది మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారులను బదిలీ చేసింది. ఇదిలా ఉండగా.. శనివారం ప్రభుత్వం 32 మంది డిప్యూటీ కలెక్టర్లతో పాటు 132 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మల్టీజోన్-1లో 84 మంది తహసీల్దార్లు, మల్టీజోన్-2లో 48 మంది తహసీల్దార్లను బదిలీ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, రాబోయే రోజుల్లో మరికొన్ని శాఖల్లోనూ అధికారుల బదిలీలు చేపట్టనున్నట్లు తెలుస్తున్నది.

# కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొమురవెల్లి ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: భక్తుల కొంగు బంగారం కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులుపోటెత్తారు. రెండవ ఆదివారం సందర్భంగా దర్శనానికి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, వేకువ జాము నుంచే కోనేరులో స్నానాలు చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, కేశ ఖండన, గంగరేగు చెట్టువద్ద ముడుపులు చెల్లించుకున్నారు. ఒగ్గు కళాకారుల నృత్యాలు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది.

# మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం.. ఈతకు వెళ్లి ఇద్దరు చిన్నారులు మృతి

మహబూబాబాద్ ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మహబూబాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది.

ఈత కు వెళ్లి ఇద్దరు చిన్నారులు మృత్యువాతపడ్డారు ఈ విషాదకర సంఘటన తొర్రూరు మండలం అమ్మాపురం లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికలు ఊర చెరువులో మునిగి 10, 12 ఏండ్ల వయసు ఉన్న ఇద్దరు బాలురు మృతి చెందారు. అప్పటి వరకు తమ కండ్ల ముందే తిరిగిన పిల్లలు.. విగతజీవు లుగా మిగలడంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఎన్నికేసులు పెట్టినా తగ్గేదేలేదు

## -టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

అమరావతి ఫిబ్రవరి 11 (ఎస్ ప్రెస్ న్యూ స్); : టీడీపీ నాయకులు , కార్యకర్తలపై ఎన్నికేసులు పెట్టినే తగ్గేదేలేదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ఇబ్బందులు పెట్టిన అధికారుల పేర్లను రెడ్‌బుక్ లో రాశానని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పలాస నియోజకవర్గంలో నిర్వహించిన శంఖారావంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో ఉత్తరాంధ్రను జాబ్ క్యాపిటల్‌గా చేస్తే వైసీపీ గంజాయి క్యాపిటల్‌గా చేసిందని ఆరోపించారు.విశాఖ జిల్లాలో వైసీపీ నేతల వేధింపులతో అధికారుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. 23 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తామని ప్రకటించి, ఎన్నికల ముందు 6వేల పోస్టులతో డీఎస్సీ ప్రకటించడంపై మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి ఏటా డీఎస్‌సీని వేస్తామని ప్రకటించారు. గడిచిన ఐదేండ్లలో జగన్ ప్రభుత్వం కరెంటు ఛార్జీలు 9 సార్లు, ఆర్టీసీ ఛార్జీలు మూడుసార్లు పెంచారని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకొంటామని లోకేష్ వెల్లడించారు.

# దేశంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా తగినంత విద్యుత్ అందుబాటులో ఉంచుకునేలా 'వనరుల సమృద్ధి మార్గదర్శకాలకు' కట్టుబడి ఉండాలి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:దేశంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు 'వనరుల సమృద్ధి మార్గదర్శకాలు' పాటించాలని భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు ఉ కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖలు రాసింది.

2030 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ అధిక స్థాయిలో వృద్ధి చెందుతుందని ఉ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని అంచనా. ఈ ప్రకారం ఇప్పటికే దేశంలో విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. గరిష్ట విద్యుత్ డిమాండ్ 2014లోని 136 గి.వా. నుంచి ప్రస్తుతం 243 గి.వా.కు చేరింది, 79% పైగా వృద్ధి చెందింది. దీనికి అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యమూ పెరిగింది. 2014 మార్చిలోని 248.5 గి.వా. నుంచి 2023 డిసెంబర్‌లో 428.3 గి.వా.కు చేరింది, ఇది 72.4% పెరుగుదల. దీంతోపాటు, దేశంలో 117 గి.వా. విద్యుత్ పంపిణీకి తగిన అంతర్-ప్రాంతీయ ప్రసార మౌలిక సదుపాయాలు ఏర్పాటయ్యాయి.

విద్యుత్ (వినియోగదార్ల హక్కులు) నిబంధనలు-2020లోని 10వ నిబంధన ప్రకారం, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ సంఘం తక్కువ సరఫరా గంటలను నిర్ణయించిన కొన్ని వినియోగ వర్గాలకు మినహా, మిగిలిన అందరికీ 24 గంటల విద్యుత్‌ను పంపిణీ లైసెన్స్ పొందిన సంస్థలు అందించాలి. ఇందుకోసం, పంపిణీ సంస్థలన్నీ 24 గంటలూ తగినంత సరఫరా సామర్థ్యంతో పని చేయాలి. దీనికి సంబంధించి, 2023 జూన్ 28న విద్యుత్ (సవరణ) నిబంధనలు -2022లోని 16వ నిబంధన ప్రకారం 'వనరుల సమృద్ధి మార్గదర్శకాలను' భారత ప్రభుత్వం జారీ చేసింది.వనరుల సమృద్ధి (ఆర్ఏ) మార్గదర్శకాల ప్రకారం, విద్యుత్ అవసరాలను తీర్చడానికి పంపిణీ సంస్థలు 10 సంవత్సరాలకు ఆర్ఏ ప్రణాళికను సిద్ధం చేయాలి. 2024-25 నుంచి 2033-34 వరకు అన్ని రాష్ట్రాలు ఉ యూటీలు తప్పనిసరిగా తమ వనరుల సమృద్ధి ప్రణాళికలను పూర్తి చేయాలి.

ఇప్పటి వరకు, 'సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ' (సీఈఏ) ద్వారా, ఢిల్లీ, గోవా, సిక్కిం, హరియాణా, బిహార్, పశ్చిమ బెంగాల్, చండీగఢ్, పుదుచ్చేరి ఉ జమ్ముఉకశ్మీర్ వంటి 23 రాష్ట్రాలు ఉ యూటీలకు 2031-32 వరకు 'వనరుల సమృద్ధి అధ్యయనాలు' పూర్తయ్యాయి. మిగిలిన రాష్ట్రాలు ఉ యూటీలకు ఆర్ఏ అధ్యయనాలు పురోగతిలో ఉన్నాయి. అయితే, జాతీయ స్థాయి ఆర్ఏ అధ్యయనాల కోసం 2033-34 సంవత్సరానికి సంబంధించిన సమాచారాన్ని పంపిణీ లైసెన్స్ సంస్థలు సీఈఏకి సమర్పించాలి. ఈ ప్రకారం, 'రిసోర్స్ అడిక్వసీ గైడ్‌లైన్స్' పాటించాలంటూ ఈ నెల 2న ఒక లేఖను రాష్ట్రాలు ఉ యూటీలకు భారత విద్యుత్ మంత్రిత్వ శాఖ పంపింది.

# ఇరిగేషన్ చర్చలో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలకు సీఎం దిశానిర్దేశం

హైదరాబాద్ ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజాభవన్‌లో ఆదివారం ప్రత్యేక సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రేపు(సోమవారం) అసెంబ్లీలో ఇరిగేషన్‌పై శ్వేతపత్రం విడుదల నేపథ్యంలో ప్రజా ప్రతినిధుల సమావేశం ప్రత్యేకత సంతరించుకుంది. ఇరిగేషన్ చర్చలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.కృష్ణా ప్రాజెక్టులు బోర్డుకు అప్పగించే విషయంలో నెలకొన్న వివాదంపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో జరిగిన అనేక అంశాలపై ఎమ్మెల్యేలకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కొత్త ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ఎమ్మెల్యేలకు మంత్రి ఉత్తమ్ వివరించనున్నారు. ఈనెల13వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ బ్యారేజ్‌ను రేవంత్, ఎమ్మెల్యేలు సందర్శించనున్నారు. ఎమ్మెల్యేలు మేడిగడ్డ సందర్శనపై సీఎల్పీ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.



# భీమవరం బరిలో పవన్ రీఎంట్రీ.. ఓడిన చోటే గెలవాలనే ధ్యేయం..





భీమవరంఫిబ్రవరి 12: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గత ఎన్నికల్లో భీమవరం, గాజువాక లలో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. గత ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లకు ఈసారి అవకాశం లేకుండా పక్క వ్యూహంతో జనసేనని ఉన్నారనేది ఆ పార్టీ నాయకుల ప్రణాళికలు చూస్తే తెలుస్తుంది. గతంలోలా రెండు చోట్ల పోటీ చేయకుండా కేవలం భీమవరం నుంచే పకడ్బందీ వ్యూహంతో ఎన్నికల బరిలోకి దిగేందుకు రంగం సిద్ధం చేశారనేది జనసేన వర్గాలను అందుతున్న సమాచారం. భీమవరం నుంచి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీకి సిద్ధకావడంతో జనసేన వర్గంలో జోష్ కనిపిస్తోంది. పవన్ పోటీపై రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు.

పవన్ కళ్యాణ్ సొంత జిల్లా పశ్చిమగోదావరిలో జనసేన, టీడీపీ కూటమి బలంగా కనిపిస్తోంది. ఈ కూటమి బలాన్ని జనసేన బలోపేతానికి, జనసేనాని గెలుపుకి ఉపయోగించుకోవాలని జనసైనికులు తహతహలాడుతున్నారు.పవన్ కళ్యాణ్ తిరిగి భీమవరం నుంచి పోటీ కి సిద్ధమైనట్లు వస్తున్న సమాచారంతో తెలుగు రాష్ట్రాల్లో భీమవరం పై ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. చర్చలతో పాటు జనసేన సేనాని గెలుపు పై జోరుగా పందాలు కాస్తున్నారు.గత ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీల త్రిముఖ పోరులో జనసేనాని పై వైసీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ సుమారు నాలుగు శాతం ఓట్లతో విజయం సాధించారు. నేడు జనసేన, టీడీపీ పార్టీలు పొత్తులో భాగంగా ఒకటవ్వడంతో గతంలో టీడీపీకి పడిన ఓట్లు జనసేనకు బదిలీ అవుతాయనే ధీమాతో జనసేన నాయకులు ఉన్నారు. ఈసారి ఎలాగైనా భీమవరం నుంచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలనే సంకల్పంతో జనసేన ఇక్కడ పనిచేస్తున్నాయి. ఇంకా ఎన్నికలకు సుమారు రెండు నెలలు మాత్రమే సమయం ఉండడంతో ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే భీమవరం ఎన్నికలలో అధికార వైసీపీ నుంచి తిరిగి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. పవన్ కళ్యాణ్ భీమవరం నుంచే పోటీ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడమే మిగిలి ఉందని జన సైనికులు చెబుతున్నారు.

భీమవరంలో ఏ పార్టీ విజయం సాధిస్తుందో ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందనేది ఇక్కడ నానుడి. ఇందుకు గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు, రాష్ట్రంలో అధికారం చేపట్టిన పార్టీలనే ఉదాహరణగా చెబుతూ ఉంటారు. ఇక్కడ నుంచి గెలుపొందిన అభ్యర్థులు ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పారు. ఒకప్పుడు క్షత్రియలకు కంచుకోటగా ఉన్న భీమవరం నియోజవర్గం నేడు కాపు సామాజి వర్గానికి కంచుకోటగా మారింది.

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కోసం జనసేన నాయకులు భీమవరం నియోజకవర్గంలో జోరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒకవైపు పార్టీలోకి చేరికలను ప్రోత్సహిస్తూనే మరోవైపు తమ కూటమిలో భాగస్వామ్య టీడీపీ తో కలిసి ఇంటింటికీ కార్యక్రమాలను జనంలోకి జనసేన ను తీసుకు వెళ్తున్నారు. సుమారు నెలరోజులుగా జనంలోకి జనసేన కార్యక్రమాన్ని భీమవరం నియోజక వర్గంలో నిర్వహిస్తున్నారు. జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) మార్గ నిర్దేశంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమల్ల చంద్రశేఖర్, ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో జనసేన కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. జనసేన నాయకులు ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ పంచుతూ జనసేన, టీడీపీ కూటమికి ఈసారి మద్దతు తెలపాలని కోరుతున్నారు. పనిలో పనిగా వైసిపి ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు ఎక్కువ పెడుతున్నారు.

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉభయ గోదావరి జిల్లాల పర్యటన ఈనెల 14న భీమవరం నుంచే ప్రారంభించనున్నారు. మూడు రోజులపాటు ఈ పర్యటన సాగనుంది. 14న తొలి రోజు భీమవరంలో పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించే సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడతారు. అనంతరం పాలకొల్లులో నిర్వహించే సమావేశంలో ఆయన పాల్గొంటారు. పశ్చిమ సమావేశాల అనంతరం అమలాపురం, కాకినాడ, రాజమండ్రిలలో జరిగే సమావేశాల్లో పవన్ కళ్యాణ్ పాల్గొంటారు. పవన్ భీమవరం పర్యటనలో తెలుగుదేశం ముఖ్య నాయకులతో కూడా ప్రత్యేకంగా చర్చించనున్నట్లు సమాచారం. టీడీపీ జనసేన శ్రేణుల ఐక్యంగా ముందుకు సాగటం, భవిష్యత్తు లక్ష్యాలపై ఈ భేటీలో ప్రస్తావించనున్నారు. భీమవరం నుంచే తన పోటీ ఖరారు చేస్తున్నట్లు పవన్ ప్రకటించే అవకాశం కనిపిస్తోంది.

# పేషేంట్‌ను ఎలుకలు కొరికితే డాక్టర్స్‌కి శిక్షా....నిరసనకు దిగిన సిబ్బంది..




నిజామాబాద్, ఫిబ్రవరి 12:కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉద్రికత్త చోటుచేసుకుంది. ఎలుకల దాడుల నేపథ్యంలో డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్ సస్పెన్షన్ పై వైద్యుల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కామారెడ్డి ఆస్పత్రి వైద్యుల సస్పెన్షన్ పై నిరసనలు చేపట్టారు. దీనిపై వైద్యులు మాట్లాడుతూ . ఎలుకలు పేషంట్స్ నీ కొరికితే వైద్యులను ఎందుకు బలి చేస్తున్నారు అని ప్రశ్నించారు.శానిటేషన్ సిబ్బంది పై కాకుండా వైద్యులపై ఎందుకు చర్యలు తీసుకుంటున్నారు అని మండిపడ్డారు. గత ప్రభుత్వం అనాలోచిత చర్యల వల్ల మెడికల్ కాలేజీలు నిర్మాణం కన్నా ముందే షెడ్ లల్లో మెడికల్ కాలేజీ లను ప్రారంభించారని తెలిపారు. వంద పడకలున్న జిల్లా ఆస్పత్రి నీ మెడికల్ కాలేజీ చేశారని అన్నారు. వంద మందికి సరిపడా శానిటేషన్ స్టాఫ్ ఉన్నారన్నారు. ఇప్పుడు హాస్పటల్ లో బెడ్స్ సంఖ్య 350 కి పెంచారని తెలిపారన్నారు. గత ప్రభుత్వం నియామకాలు చేపట్టకపోవడంతోనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నయని వైద్యులు మండిపడుతున్నారన్నారు. ఇవ్వాళ ఆరోగ్య శాఖ మంత్రి తో ప్రభుత్వ వైద్యుల చర్చలు ఉన్నాయని తెలిపారు. అయితే వెంటనే డాక్టర్ల పై విధించిన సస్పెన్షన్ నీ ఎత్తివేయాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు.

# 15న సమ్మక్క సారక్క వేలం పాటలు

ములుగు ఫిబ్రవరి 12(ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మేడారానికి భక్తులుపోటెత్తారు. ముందస్తు మొక్కులు చెల్లించుకునేందుకు వన దేవతల చెంతకు భక్తులు తరలి వస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తుల రద్దీ పెరిగింది. తెలంగాణ కుంభమేళాగా పేరు గాంచిన మేడారం సమక్క - సారలమ్మ జాతర ఈనెల 21 నుంచి ప్రారంభంకానుంది. జాతర తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.కాగా జిల్లా కేంద్రంలోని గోదావరి తీరంలో నిర్వహించనున్న సమ్మక్క- సారలమ్మ జాతర ఏర్పాట్లను శనివారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్‌చైర్మన్ సల్ల మహేష్, కమిషనర్ మారుతి ప్రసాద్ పరిశీలించారు. ప్రత్యేక నిధులతో గద్దెల వద్ద ప్లాట్‌ఫాంల నిర్మాణాలను, మంచినీటి సరఫరా పనులను సమీక్షించారు. కౌన్సిలర్లు అనిత రవీందర్‌రావు, శ్వేతరమేష్, ఎంఈ మధుకర్ పాల్గొన్నారు.

### 15న సమ్మక్క సారక్క వేలం పాటలు

మందమర్రి పట్టణంలోని పాలవాగు ఒడ్డున ఈనెల 21 నుంచి 24 వరకు సింగరేణి యాజమాన్యం నిర్వహించే సమ్మక్క సారక్క జాతరకు సంబంధించి దుకాణాల వేలంపాటలు ఈ నెల 15న నిర్వహిస్తున్నామని జాతర కమిటీ వారు తెలిపారు. కొబ్బరికా యలు, వాహన పార్కింగ్, బెల్లం తూకాలు, ఇతర దుకాణాలు జాతరలో ఏర్పాటు చేసుకునే వారు 10 గంటలకు వెంకటేశ్వర ఆలయంలో హాజరు కావాలని తెలిపారు. వేలంలో పాల్గొని దుకాణాలను కైవసం చేసుకోవచ్చని, చిన్న దుకాణాలు పెట్టుకోదల్చిన వారు రూ.1000 చెల్లించి టోకెన్ తీసుకున్న వారికి అనుమతి ఇస్తామని తెలిపారు.

# ఏపికి రాజధాని అమరావతే

## -మంత్రి అంబటి రాంబాబు

అమరావతి, ఫిబ్రవరి 12:టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌వి అనైతికమైన పొత్తులు అని దుయ్యబట్టారు మంత్రి అంబటి రాంబాబు. మాచర్లలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అసలు జనసేన ఎవరితో పొత్తు లో ఉంది బీజేపీతోనా, టీడీపీతోనా అని నిలదీశారు

వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నరసరావుపేట ఎంపీ స్థానాన్ని బీసీకి కేటాయించారని.. సిట్టింగ్ ఎంపీగా ఉన్న లావు శ్రీ కృష్ణ దేవరాయలు పార్టీ విడిచి వెళ్లిపోయారని మండిపడ్డారు.. బీసీలకు సీటు ఇస్తే తట్టుకోలేక ఇంకో పార్టీలోకి వెళ్తున్న లావు ఒక బీసీ ద్రోహిగా ఫైర్ అయ్యారు.. వచ్చే ఎన్నికల కోసం పార్టీ అసంతృప్తులు సరి చేసుకొని ముందుకు వెళ్తామని తెలిపారు. ఇక, ఏపీ రాజధానిపై మాట్లాడుతూ, .. ప్రస్తుతానికి ఏపీకి రాజధాని అమరావతే అని స్పష్టం చేశారు..

# బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్



నిజామాబాద్, ఫిబ్రవరి 12:నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ గా (రెవెన్యూ) ఎస్.కిరణ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్ కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్ కు స్వాగతం పలికి, పరిచయం చేసుకున్నారు.

నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ గా కొనసాగిన పి.యాదిరెడ్డిని బదిలీచేస్తూ, ఆయన స్థానంలో ఎస్.కిరణ్ కుమార్ ను నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ గా ప్రభుత్వం ఇటీవలే పోస్టింగ్ కల్పించింది. ఈ మేరకు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సోమవారం ఇక్కడికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలుకుతూ, శుభాకాంక్షలు తెలియజేశారు.

# కాంగ్రెస్ పార్టీకి కేంద్రంతో లోపాయకారి ఒప్పందం

## - సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

నల్గొండ ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన నల్గొండలో మీడియా తో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి కేంద్రంతో లోపాయకారి ఒప్పందం ఉందన్నారు. సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు సాగర్ ప్రాజెక్టును ఆక్రమించడానికి ఏపీ వస్తే మేమే తరిమామని, ప్రస్తుతం కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు సాగర్ ప్రాజెక్టుకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. కృష్ణా జలాల హక్కులపై బీఆర్ఎస్ పోరాటంతోనే కేఆర్ఎంబీకి అప్పగించలేదని కాంగ్రెస్ తీర్మానం చేసిందన్నారు. కృష్ణా జలాల సాధన కోసం రేపు (మంగళవారం) నల్గొండలో బీఆర్ఎస్ సభ నిర్వహించనుందని.. ఈ కార్యక్రమానికి ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ప్రజలు భారీగా హాజరవుతారన్నారు. కాంగ్రెస్ తీరుపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని జగదీష్ రెడ్డి పేర్కొన్నారు.

# ట్రాన్స్ జెండర్లపై వస్తున్న పుకార్లు నమ్మొద్దు..




నిజామాబాద్, ఫిబ్రవరి 12: ట్రాన్స్ జెండర్లను కిడ్నాపర్లుగా చిత్రీకరిస్తూ కొందరు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని? పిల్లలను ఎత్తుకుపోతున్న వారమని సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లు అవాస్తవమని ట్రాన్స్ జెండర్స్ రక్ష, జరీనా, శ్యామల అన్నారు. సమాజం లో తాము కూడా మనుషులమేనని మమ్మల్ని గుర్తించాలని కోరారు. గత 15 రోజులుగా ఎక్కడికి వెళ్లినా తమను కిడ్నార్లుగా భావిస్తున్నారని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారా టలు చేస్తున్నారని పేర్కొన్నారు. సోమ వారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తాము పొట్టకూటి కోసం భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తున్నామని, కానీ కొందరు తమను కిడ్నాపర్లు అంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పేర్కొ న్నారు. గత కొన్ని సంవత్సరాలుగా నగరంలో ఉంటున్నామని, తాము పిల్లలకు, పెద్దలకు ఆశీర్వాదాలు ఇస్తమే తప్ప, వారికి ఎలాంటి హానీ చేయమని చెబుతున్నారు. ఇటీవల తాము భిక్షాటన కోసం వెళితే, తమను కిడ్నాపర్లు అంటూ, సోషియల్ మీడియాలో ఫోటోలను పోస్ట్ చేశారని, ఇది మంచి పద్ధతి కాదని, ఎవరైనా తప్పు చేస్తే పోలీసులకు అప్పజెప్పాలని, కానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దన్నారు. ఆర్మూర్, రుద్రూర్ లలో సోషల్ మీడియాలో తమపై కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తమ పై సమాజంలో ఇప్పటికే చిన్నచూపు ఉందని, ఇలాంటి పుకార్లు వదంతులు చేయడం వలన ప్రజలు తమను అసహించుకునే అవకాశం పెరుగుతుందని వాపో యారు. దయచేసి తమపై లేని పోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికీ తాము సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఎవ్వరూ ఉద్యోగాలు ఇవ్వక పోవడం తో బిక్షాటన చేస్తూ జీవనం గడుపుతున్నామని, ఇలా పుకార్లు చేయడం వల్ల తమ బ్రతుకు ఆగమ్యగోచరంగా మారనుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందరి మేలు మాత్రమే కోరుకుం టామని, అడుక్కుని తిని బ్రతికే తమపై కావాలని కొందరు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. తమ అందరికీ ట్రాన్స్ జెండర్ గా గుర్తింపు కార్డులు ఉన్నాయన్నారు. ట్రాన్స్ జెండ‌ర్స్ కాని వారు ఎవరైనా తమ చుట్టుపక్కల కనిపిస్తే తామే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి వారిని అప్పగిస్తామన్నారు. నిజామాబాద్ జిల్లా ప్రజలు అర్థం చేసుకొని అందరితో పాటు తాము బ్రతికేలా అవకాశం కల్పించా లని కోరారు. ఈ మీడియా సమావేశంలో హారతి, గంగా, ప్రియా, ప్రజ్ఞా, అలకనంద, తదితర ట్రాంజెండర్లు పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణాలకు సహకరించాలి - బండి సంజయ్



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 12: (నేటినిజం ప్రతినిధి): దేవాలయాల నిర్మాణాలకు హిందూ బంధువులందరూ సహకరించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ పిలుపునిచ్చారు. సోమవారం సిరిసిల్లలోని శ్రీ శివభక్త మార్కండేయ స్వామి జయంతి ఉత్సవాల్లో బండి సంజయ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజాహిత యాత్ర సోమవారం ప్రారంభానికి ముందే ఉదయం పూట సిరిసిల్లలోని మార్కండేయ దేవస్థానానికి వచ్చి జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆయురారోగ్యాలతో నిండునూరేళ్లు బ్రతకాలని, ప్రశాంత జీవితం గడపాలని, కష్టాలు తొలగిపోయి సంస్కారవంతమైన జీవితం గడిపేవిధంగా స్వామి ఆశీర్వాదం అందజేయాలని మార్కండేయ స్వామిని వేడుకున్నట్టు బండి సంజయ్ తెలిపారు.. 500 సంవత్సరాల నుంచి ఎదురుచూసిన అయోధ్య బాల రాముడి ఆలయ నిర్మాణంలో దేశవ్యాప్తంగా హిందువులందరూ భాగస్వాములయ్యారని, అలాగే సిరిసిల్ల మార్కండేయ దేవస్థానం నిర్మాణంలో కూడా అందరూ కలిసి మెలిసి సమైక్యంగా భాగస్వాములు కావాలని కోరారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి జయంతి ఉత్సవాలు ప్రతిసారి బ్రాహ్మణంగా జరుగుతాయని, ఈసారి కొత్తగా ఆలయ నిర్మాణం చేపట్టినప్పటికీ ఆ స్థాయిలోనే ఉత్సవాలు జరుపుతున్నారన్నారు. దేవస్థానాల నిర్మాణంలో హిందువులందరూ సహకరించి భాగస్వాములు కావాలన్నారు. 500 సంవత్సరాల నుంచి ఎదురుచూసిన అయోధ్య బాల రాముడి ఆలయ నిర్మాణంలో దేశవ్యాప్తంగా హిందువులందరూ భాగస్వాములయ్యారని, అలాగే సిరిసిల్ల మార్కండేయ దేవస్థానం నిర్మాణంలో కూడా అందరూ కలిసి మెలిసి సమైక్యంగా భాగస్వాములు కావాలని కోరారు. సిరిసిల్లలో మార్కండేయ దేవస్థానం శక్తివంతమైన దేవాలయంగా రూపుదిద్దుకోబోతుందని, చుట్టుపక్కల ప్రాంతాల వారందరికీ కూడా మార్కండేయ స్వామి శక్తి వ్యాప్తం కానున్నదన్నారు.

పార్లమెంటు సభ్యుడిగా, హిందువుగా సిరిసిల్ల మార్కండేయ దేవస్థానంకు సహకారం అందిస్తానన్నారు. మార్కండేయ స్వామి జయంతి ఉత్సవాల సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు గోలి వెంకటరమణ కార్యదర్శి మండల సత్య, ఉపాధ్యక్షులు డాక్టర్ గాజుల బాలయ్య, పద్మశాలి సంఘం పాలకవర్గంతో పాటు బిజెపి నాయకులు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆడెపు రవీందర్, బిజెపి మున్సిపల్ కౌన్సిలర్ గూడూరు భాస్కర్, పట్టణ కార్యదర్శి నాగుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డబోయిన గోపి, కోడం ఆనందబాబు, మోర శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ గుర్తింపును రద్దు చేయాలి

## -మాజీ మంత్రి జవహర్ డిమాండ్

అమరావతి ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల అక్రమాలకు కారణమైన వైసీపీ గుర్తింపును రద్దు చేయాలని మాజీ మంత్రి జవహర్ అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ నేతలు గురుమూర్తి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలను రాబోయే ఎన్నికల్లో పాల్గొనకుండా అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

జగన్ గతంలో నోట్ల కుంభకోణం చేశారని.. ఇప్పుడు ఓట్ల కుంభకోణం చేస్తున్నారని ఆరోపిం చారు. ఎన్నికల్లో అక్రమాలను ఏ విధంగా చేయాలనే దానిపై తిరుపతి ఉప ఎన్నికలు ఓ మోడల్‌గా నిలుస్తాయని విమర్శించారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 35 వేల ఓటర్ కార్డులను వైసీపీ నేతలు డౌన్ లోడ్ చేశారన్నారు. గిరీషా, చంద్రమౌళీశ్వర రెడ్డి లాంటి అధికారులు అక్రమాలకు పాల్పడ్డారంటే అది వారి కోసం కాదని.. వారి వెనుక వైసీపీ నేతలు ఉండే ఈ పని చేయించారని చెప్పారు. తిరుపతి ఉప ఎన్నికల్లో వైసీపీని గెలిపించడానికే అధికారిక లాగిన్ నుంచి ఓటర్ కార్డులను డౌన్ లోడ్ చేశారన్నారు. ఆ ఎన్నికల్లో గెలుపొందిన గురుమూర్తి మళ్లీ అక్కడి నుంచే పోటీ చేస్తున్నారన్నారు. గురుమూర్తి కూడా ఓ తోలు బొమ్మ అని ఎద్దేవా చేశారు.

తెరవెనుక ఉండే తోలు బొమ్మలను ఆడించే మనుషులు పెద్దిరెడ్డి, చెవిరెడ్డి, భూమన, సజ్జల వంటి నేతలని విమర్శించారు. సీఈఓ కార్యాలయంలోనే జగన్ మనుషులున్నారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చని అన్నారు. తిరుపతి ఉప ఎన్నికల తరహా అక్రమాలు ఇంకెన్ని చోట్ల జరిగి ఉంటాయి..? అని ప్రశ్నించారు.

ఇంకెంత మంది ఎన్నికల అధికారుల లాగిన్లు జగన్ చేతిలో ఉన్నాయోననే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఎన్నికల అక్రమాలకు పాల్పడిన గురుమూర్తి, పెద్దిరెడ్డి, భూమన, చెవిరెడ్డి వంటి వైసీపీ నేతలను ఎన్నికల్లో పాల్గొనకుండా అనర్హులుగా ప్రకటించాలని జవహర్ డిమాండ్ చేశారు.

# ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి త్వరగా పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్



ఖమ్మం, ఫిబ్రవరి 12:(నేటినిజం ప్రతినిధి): ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. సోమవారం మధిర పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. సోమవారం మధిరలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 106 అర్జీలు వివిధ సమస్యలకు సంబంధించి వచ్చాయన్నారు. ఇందులో ప్రధానంగా పశుసంవర్ధక శాఖకు సంబంధించి 33, రెవిన్యూకు సంబంధించి 25, వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి 11, మునిసిపాలిటీలకు సంబంధించి 9 అర్జీలు వచ్చాయన్నారు. ప్రతి అర్జీకి అధికారులు స్పందించి పరిష్కార చర్యలు అర్జీదారునికి తెలుపాలన్నారు. ప్రజావాణిలో మధిర మండలం మునగాల గ్రామంలోని సర్వే నెం.42లో దేవిశెట్టి జాన్సీ, భూక్యా నాగేశ్వరరావు, చావా సాంబశివరావు, మేనుగు రాములమ్మ, ఎడలపల్లి లక్ష్మిదేవి లకు చెందిన భూమి నిషేదిత జాబితాలో ఉండగా అట్టి దానిని తొలగింపునకు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి జిల్లా కలెక్టర్ తక్షణ పరిష్కారం చేశారు. మధిరకు చెందిన వృద్ధ కళాకారులు తమకు ఆరు నెలల నుండి వృద్ధ కళాకారుల పింఛన్ రావడం లేదని, ఇప్పించగలందులకు జిల్లా కలెక్టర్‌ను కోరగా, జిల్లా పౌరసంబంధాల అధికారిని వెంటనే చర్యలకై కలెక్టర్ ఆదేశించారు. బోనకల్ మండలం మోటమర్రికి చెందిన యం.వెంకటరత్నం తనకు 2018-19 సంవత్సరంలో ఎస్సీ కార్పోరేషన్ ద్వారా ఋణం మంజూరు అయినదని కాని ఇంత వరకు సబ్సిడి జమ కాలేదని, సబ్సిడి మొత్తం ఇప్పించగలందులకు కలెక్టర్‌ను కోరగా ఎస్సీ కార్పోరేషన్ ఇడిని ఇట్టి విషయమై చర్యలకు కలెక్టర్ ఆదేశించారు. స్టేషన్ రోడ్ మధిర నుండి బోడ్డు భాస్కర మాధవసాయి, తనకు 2013లో ముఖ పక్షవాతం, 2017లో బైపాస్ సర్జరీ జరిగిందని తనకు వికలాంగుల పింఛను కొరకు సదరన్ సర్టిఫికేట్ ఇప్పించుటకు కోరగా జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను తగు చర్యకై కలెక్టర్ ఆదేశించారు. ఎర్రుపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెం నుండి జంగా ప్రసాద్‌రెడ్డి తాను జూలైలో మామిడి మొక్కలు వేసుకొనుటకు డ్రిప్ ఇరిగేషన్ కొరకు దరఖాస్తు చేసినట్లు ఇంత వరకు ఇట్టి విషయమై ఎటువంటి సమాచారం లేదని తనకు డ్రిప్ ఇప్పించగలందులకు కోరగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారిని తగు చర్యలకై కలెక్టర్ ఆదేశించారు. కల్లూరు మండలం గోపాలకుంట గ్రామం నుండి జి. నాగరాజు, తన పెద్ద కుమార్తె గుండ్ల ప్రసన్న 6 మార్చి 2022లో అనారోగ్యంతో మరణించింది ఇన్సురెన్స్ డబ్బులు ఇప్పించగలరని కోరగా సహాయ కార్మిక శాఖ అధికారిని తగు చర్యకై కలెక్టర్ ఆదేశించారు. మధిర మున్సిపాలిటీ రెండవ వార్డు ప్రజలు తమకు పది సంవత్సరాల నుండి త్రాగునీటి సరఫరా లేదని, రోడ్డు, వీధి స్థంబాలు, పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా లేదని తగు చర్యలకై కోరగా మధిర మున్సిపల్ కమిషనర్‌ను వెంటనే చర్యలు చేపట్టవలసిందిగా కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం నుండి వి.ఆశా కుమారి తాను ఎంటెక్, బిఈడి చదివినట్లు ప్రభుత్వ శాఖలలో ఉపాధి కల్పనకు కోరగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిని తగు చర్యకై కలెక్టర్ ఆదేశించారు. రైతు సంఘం నాయకులు యం.సైదులు, శీలం నర్సింహారావులు, మధిర మండలంలో వారం రోజుల పాటు సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు జరిపించాలని, మధిర మార్కెట్ యార్డులో మిర్చి అమ్ముకునేందుకు ఆదేశాలు ఇవ్వగలరని కోరగా జిల్లా మార్కెటింగ్ అధికారిని తగు చర్యలకై కలెక్టర్ ఆదేశించారు. మధిర 10వ వార్డు నుండి యం.వినయ్‌కుమార్ తమ వార్డులో పనులు అసంపూర్తిగా ఉన్నట్లు, వీధిలైట్లు వెలగడం లేదని, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, మిషన్ భగీరథ పైప్‌లైన్ తవ్వి వదిలేసారని తగు చర్యలకై కోరగా మధిర మున్సిపల్ కమిషనర్, మిషన్ భగీరథ ఈఈలను తగు చర్యలకై ఆదేశించారు. మధిర బంజరా కాలనీ నుండి మందా సైదులు బంజరా కాలని ప్రాథమిక పాఠశాలకు భవనం, కాంపౌండ్ వాల్, మంచినీటి సమస్యలను వున్నట్లు తగు చర్యలకై కోరగా జిల్లా విద్యాశాధికారికారిని వెంటనే పరిశీలించి ప్రతిపాదనలు సమర్పించవలసినదిగా కలెక్టర్ ఆదేశించారు. మధిర పట్టణంలోని 17,18వ వార్డు ప్రజలు లడక బజారులో రైస్‌మిల్లు వల్ల డస్ట్ పొల్యూషన్‌తో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నట్లు ఇట్టి విషయమై తగు చర్యలు తీసుకోగలరని కోరగా జిల్లా కలెక్టర్ తహశీల్దారు, కాలుష్య నివారణ ఇంజనీరును పరిశీలించి తగు చర్యకై ఆదేశించారు. పొద్దుటూరు, రాయపట్నం, సిరిపురం గ్రామాల గొల్ల కురుమలు తాము గొర్రెల యూనిట్ల కొరకు రూ.43,750లు డిడి కట్టినట్టు తమకు గొర్రెల యూనిట్లు ఇప్పించగలందులకు కోరగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని తగు చర్యలకై ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.వి. అప్పారావు డి.పి.ఓ.హరికిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన, ఖమ్మం ఆర్.డి.ఓ జి.గణేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, డివిజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడు అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్



చెన్నై, ఫిబ్రవరి 12: తమిళనాడు గవర్నర్‌ఆర్‌ఎన్ రవి .. డీఎంకే పార్టీ వైఖరి పట్ల అసహనం వ్యక్తం చేశారు. అసెంబ్లీని ఉద్దేశించి ఇవాళ ఆయన ప్రసంగం చేశారు. అయితే కొన్ని క్షణాల్లోనే ఆయన తన ప్రసంగాన్ని ముగించేశారు. ప్రసంగం ప్రారంభానికి ముందు, చివరకు జాతీయ గీతాన్ని ఆలపించలేదన్నారు. ప్రసంగ పాఠాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. జాతీయ గీతాన్ని డీఎంకే గౌరవించలేదన్నారు. అందుకే తన ప్రసంగాన్ని తొందరగా ముగించి వెళ్తున్నట్లు ఆయన చెప్పారు.

గవర్నర్ ప్రసంగం కోసం తమిళనాడు అసెంబ్లీ ఇవాళ సమావేశమైంది. అయితే ప్రసంగ పాఠంలో ఉన్న అనేక అంశాలను తాను వ్యతిరేకిస్తున్నట్లు గవర్నర్ ఆర్‌ఎన్ రవి తెలిపారు. అంగీకరించిన అంశాల గురించి ప్రసంగంలో చెప్పడం.. రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే అవుతుందని ఆయన అన్నారు. సభ మీద ఉన్న గౌరవంతో తన ప్రసంగాన్ని త్వరగా ముగించేస్తున్నట్లు చెప్పారు.

అయితే సభాకార్యక్రమాలు సజావుగా సాగాలని, ప్రజల కోసం ఆరోగ్యకరమైన చర్చలు చేపట్టాలని రవి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల కేరళ గవర్నర్ ఆరిఫ్ ఖాన్ కూడా తన ప్రసంగాన్ని అర్థాంతంగా ముగించిన విషయం తెలిసిందే.

# అనర్హత పిటిషన్లపై స్పీకర్ వద్ద విచారణకు వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు డుమ్మ

అమరావతి ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: అనర్హత పిటిషన్లపై స్పీకర్ వద్ద విచారణకు వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు హాజరుకాలేదు. ఈ రోజు (సోమవారం) ఉదయం స్పీకర్ ఎదుట విచారణకు హాజరుకావాలంటూ ఎమ్మెల్యేలుగా నోటీసులు అందించినప్పటికీ విచారణకు వెళ్లలేదు. వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలకు నోటీసులు పంపించారు. తాము వివిధ కారణాల దృష్ట్యా విచారణకు హాజరు కాలేకపోతున్నామని స్పీకర్‌కు వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు లేఖ రాశారు. తాము అనారోగ్య కారణాల దృష్ట్యా హాజరు కాలేకపోతున్నట్టు ఒకరిద్దరు లేఖలు రాశారు. కాగా వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలను ఉదయం పూట, టీడీపీ రెబల్ ఎమ్మెల్యేలు మధ్యాహ్నం పూట విచారణకు రావాలని స్పీకర్ నోటీసులు పంపించిన విషయం తెలిసిందే.

# ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని సంతకాల సేకరణ




ఖమ్మం, ఫిబ్రవరి 12:(నేటినిజం ప్రతినిధి): సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మి నారాయణ, టిడిపి సీనియర్ నాయకులు కేతినేని హరిశ్, బీఅర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణ చైతన్య కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల-నరేందర్ నటసార్వభౌమ, తెలుగువారి ఆత్మగౌరవాన్ని దేశం నలువైపులా చాటి చెప్పిన మహనీయుడు, నందమూరి తారక రామారావుకి భారతరత్న ప్రకటించాలని ఖమ్మం పట్టణంలోని టిడిపి జిల్లా కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన "సంతకాల సేకరణ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టిడిపి జిల్లా సీనియర్ నాయకులు కేతిరెడ్డి హరీష్, బిఅర్ఎస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింత నిప్పు కృష్ణ చైతన్య కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేందర్ పాల్గొని ఈ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ...సినీ రంగంలోనే కాదు రాజకీయంగా కూడా బడుగు బలహీన వర్గాల వారికి పెద్దపీట వేసిన నాయకుడు ఎన్టీఆర్ పట్వారి వ్యవస్థను రద్దు చేసి సామాన్యులకు సైతం భూమిపై హక్కును కల్పించిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఆయన అన్నారు. ఎంతో మంది బడుగు బలహీన వర్గాలకు రాజకీయ భవిష్యత్తును ప్రసాదించిన నాయకుడు ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. ఆయనకు భారత రత్న ప్రకటించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా బిఅర్ఎస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ...సినీ రంగంలో ఎన్నో పాత్రలు పోషించి సినీ రంగానికి వన్నె తీసుకొచ్చిన నటుడు నందమూరి తారక రామారావు, అదేవిధంగా తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఖండాలు దాటించి, తెలుగువారి శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు నందమూరి తారక రామారావు, ఆరు నెలల్లో పార్టీ స్థాపించి తొమ్మిది నెలల్లో అధికారంలోకి వచ్చి పేదవాడికి కూడు, గుడ్డ, ఇల్లు అనే నినాదంతో బడుగు బలహీన వర్గాల వారికి అండగా నిలిచి పేద ప్రజల పక్షాన పరిపాలన కొనసాగించిన నాయకుడు ఎన్టీ రామారావు అని, కాబట్టి ఇలాంటి మహనీయుడికి భారతరత్న ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు కేతినేని హరీష్, బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణచైతన్య, మిక్కిలినేని మంజుల-నరేందర్, మొహమ్మద్ అశ్రిఫ్, కన్నేటి పృథ్వి, కూచిపూడి బాలు, కొలికొండ మురళి, నాగండ్ల లక్ష్మణ్, సీతారాములు పాల్గొన్నారు.


ఆహ్వానం



తె.ర.వే. జిల్లా ప్రధానకార్యదర్శి అల్లి మోహన్‌రాజ్ గారి కవిత్వం

"అమ్ముల పొది" పుస్తక ఆవిష్కరణ సభ




సభాధ్యక్షులు : సిరిసిల్లా గఫూర్ శిక్షక్ తె.ర.వే. కామారెడ్డి జిల్లా అధ్యక్షులు

ముఖ్య అతిథి & ఆవిష్కర్త : కొండి మల్లారెడ్డి తె.ర.వే. రాష్ట్ర అధ్యక్షులు

ప్రత్యేక ఆహ్వానితులు : డా॥ నర్లా రామకృష్ణారెడ్డి సెన్సార్‌బోర్డు సభ్యులు, సినర్జి విద్యాసంస్థల అధినేత, హైదరాబాద్

విశిష్ట అతిథి : సూరారం శంకర్ ప్రముఖ గజల్ కవి, తె.ర.వే. రాష్ట్ర ఉపాధ్యక్షులు

డా॥ యస్.కె. రషీద్ ప్రిన్సిపాల్, కర్షక్ బి.ఇడి. కళాశాల, కామారెడ్డి.

పుస్తక సమీక్షకులు : పర్కపెల్లి యాదగిరి తె.ర.వే. రాష్ట్ర ఉపాధ్యక్షులు

వేదిక : కర్షక్ బి.ఇడి. కళాశాల, కామారెడ్డి.

తేది : 18 ఫిబ్రవరి, ఆదివారం 2024 సమయం : ఉ॥ 10-30 ని॥ లకు

తెలంగాణ రచయితల వేదిక - కామారెడ్డి జిల్లా.

# చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు.. సీపీ కల్మేశ్వర్




నిజామాబాద్, ఫిబ్రవరి 12:జిల్లాలో కిడ్నాప్ చేస్తున్నారని, అనుమానితులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సూచించారు. చిన్న పిల్లలను ఎత్తుకెల్లే ముఠా నిజామాబాద్ జిల్లాలో తిరుగుతున్నారనే అపోహలను ప్రజలు నమ్మవద్దని కోరారు. కిడ్నాప్ చేస్తున్నారని అనుమానిస్తూ అనుమానితులపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసినట్లు సీపీ వెల్లడించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా కొన్ని రోజుల నుంచి అనుమానాస్పద కిడ్నాప్ కేసులు జరిగాయని, జరిగిన మూడు కిడ్నాప్ లలో పిల్లలను పట్టుకొని వాళ్ల తల్లిదండ్రులకు అప్పగించామని తెలిపారు. ఈ ముగ్గురి కిడ్నాపర్లకు ఒకరికొకరు ఎల్లాంటి సంబంధం లేదని విచారణలో తేలిందన్నారు.

నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో చిన్నారుల కిడ్నాప్ కేసులకు సంబంధించి ఇటీవల కాలంలో ఫేస్బుక్, వాట్సప్, ట్విట్టర్, యూట్యూబ్, సామాజిక మాధ్యమాల ద్వారా కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అనుమానితుల వీడియోను తీసి సోషల్ మీడియాలో కిడ్నాపర్లుగా చిత్రీకరిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నట్లు తెలిపారు. అలా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ హెచ్చరించారు. జిల్లాలో కిడ్నాప్ చేస్తున్నారంటూ అనుమానితులపై దాడి చేసిన 15ఘటనలు జరిగాయన్నారు. ఈ ఘటనలకు సంబంధించి మూడు కేసులు నమోదయ్యాయని వెల్లడించారు.

గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే సంబంధిత పోలీ స్ స్టేషన్ కు గాని, డయల్ 100, పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. గాయత్రి నగర్ లో సోమవారం ఓ వ్యక్తిని అనుమానిస్తూ సదరు వ్యక్తిపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారని వెల్ల డించారు. ఈ ఘటనలో సదరు వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ ఘటనలో కేసు నమోదు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో ఎలాంటి కిడ్నాపర్లు లేరని, సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలు నమ్మొద్దని, ఒకవేళ అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీ జయరాం, ట్రైనీ ఐపిఎస్ చైతన్య పాల్గొన్నారు.

# నామినేషన్లు దాఖలు చేసిన వైసిపి అభ్యర్థులు



అమరావతి, ఫిబ్రవరి 12: వైసీపీ తరపున రాజ్యసభ అభ్యర్థులుగా ముగ్గురు నామినేషన్ దాఖలు చేశారు. వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి, గొల్ల బాబురావులు అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ, రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. అంతకుముందు ఈ ముగ్గురు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిశారు. వీరికి సీఎం బీఫాం అందజేశారు.

ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. చరిత్రలో ఎప్పుడు లేని విధంగా జగన్ పార్లమెంట్ మెట్లు ఎక్కించే విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికీ అవకాశం కలిపిస్తున్నారని తెలిపారు. తమకు ఇచ్చిన ఈ అవకాశంతో ముగ్గురం కూడా విజయం సాధిస్తామని అన్నారు. అలాగే రాబోయే ఎన్నికల్లో కూడా వైసీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మళ్ళీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు అందరు కోరుకుంటున్నారని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

గొల్ల బాబురావు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ అశీసులతో తాము నామినేషన్ వేసామన్నారు. సమ సమాజం కోసం ఎంత వరకు వెళ్లాలన్నది జగన్ కి మాత్రం సాధ్యమని తెలిపారు. బడుగు బలహీన వర్గాల వారికి పెద్ద పీట వేశారని చెప్పారు. తనలాంటి సామాన్య వ్యక్తులను రాజ్యసభకి పంపిస్తున్న ఘనత జగన్ కి మాత్రమే దక్కుతుందని పేర్కొన్నారు. అలాగే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో 175 సీట్లని కూడా కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబుకి, సీఎం జగన్ కి చాలా తేడా ఉంటుంది.. గతంలో చంద్రబాబు ఎస్సీలకు చాలా మందికి అవకాశం ఇవ్వలేదన్నారు. చంద్రబాబు సొంత వర్గం అయిన కనకమేడలని రాజ్యసభకి పంపించారని.. కానీ జగన్ మాత్రం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.

మేడా రఘునాధ రెడ్డి మాట్లాడుతూ.. తనకు ఈ అవకాశం ఇచ్చిన సీఎం జగన్ కి ధన్యవాదాలు తెలిపారు. తాము కష్టపడి ప్రజల కోసం పనిచేస్తాం.. అలాగే రాబోయే ఎన్నికల్లో కూడా వైసీపీ విజయం సాధించేలా కృషి చేస్తామని ఆయన చెప్పారు.

# మున్సిపల్ చైర్మన్‌గా ఆనంద్ కుమార్ , వైస్‌గా షబ్బీర్ అహ్మద్



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 12:పాలమూరు పురపాలికలో మున్సిపల్ చైర్మన్ పై గత నెల రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు సోమవారం తెరపడింది

.ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో 33 మంది కౌన్సిలర్లతో కాంగ్రెస్ కౌన్సిలర్ ఆనంద్ కుమార్ గౌడ్ మున్సిపల్ చైర్మన్ గా , వైస్ చైర్మన్ గా మహమ్మద్ షబ్బీర్ అహ్మద్ ఎన్నికయ్యారు.

ఎన్నికైన నూతన చైర్మన్ వైస్ చైర్మన్ ల తో కలెక్టర్ శివేంద్ర ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇకనుంచి కౌన్సిల్ సభ్యులు ప్రజా సంక్షేమం కోరి పని చేస్తారన్నారు.. అనంతరం చైర్మన్ ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ గా కౌన్సిలర్లు అందరూ తనకు మద్దతు తెలిపి ఓటు వేసి ఎన్నుకోవడం ఆనందంగా ఉందని అన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .

# ప్రజావాణి దరఖాస్తుల సత్వర పరిష్కారం పై దృష్టి సారించాలి..

**-ప్రజావాణికి 65 దరఖాస్తులు**
**-జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

సంగారెడ్డి, ఫిబ్రవరి 12: (నేటినిజం ప్రతినిధి):ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల కలెక్టర్ అధనపు కలెక్టర్ చంద్రశేఖర్ తో కలిసి దరఖాస్తులను స్వీకరించారు.



అధికారులుత్వరిత గతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు.

సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యల పరిష్కారానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి

ఈ సందర్భంగా ఆవె మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన ఆయా దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించడం పై ప్రతేక దృష్టి సారించాలన్నారు.

జాప్యానికి తావివ్వరాదన్నారు.

ప్రజావాణిలో 65 దరఖాస్తులు రాగా, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 18 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 47 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ పేరు మార్చినప్పుడే పేగుబంధం తెగింది - రాజగోపాల్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 12: టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా పేరు మార్చిన నాడే తెలంగాణతో ఆ పార్టీకి ఉన్న పేగుబంధం తెగిందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కంటే ఎక్కువ దోపిడి జరిగిందని ధ్వజమెత్తారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రజలకు కళ్లకు కట్టినట్టుగా చూపించారని తెలిపారు. అధికార దాహంతో, అవినీతికి పాల్పడి పక్క రాష్ట్రంలోని సీఎం జగన్‌తో కుమ్మక్కై.. బీఆర్ఎస్ పేరు పెట్టి ప్రధాని పీఠానికే టెండర్ పెట్టిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇక కాంగ్రెస్ పార్టీదే అధికారమని పేర్కొన్నారు.

ఏనాడైతే టీఆర్ఎస్ పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చిన నాడే తెలంగాణతో వారి పేగు బంధం తెగిపోయిందంటూ ఫైర్ అయ్యారు. అసెంబ్లీలో నోటికొచ్చినట్లుగా బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఓడించి ఇంట్లో కూర్చోబెట్టినా.. ఇంకా మీకు బుద్ధి రాలేదా అంటూ తీవ్ర స్వరంతో అన్నారు.

# విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని బాధ్యతలు స్వీకరణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేంజ్ ఎస్పీలతో సమీక్ష నిర్వహిస్తున్నానని.. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పోలీసు సేవలు అందించాలన్నారు. ఆరు నెలలు యన్‌డీపీఎస్ కేసులు మీద మరింత దృష్టి పెటనున్నట్లు చెప్పారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు ఉన్నందున ఏజెన్సీ ఏరియాలో మరింత దృష్టి పెడతామన్నారు. పోలీస్ సేవలు ప్రజలకు మరింత దగ్గరగా ఉండాలని విశాల్ గున్ని పేర్కొన్నారు.

# ములుగు జిల్లాలో విషాదం.. డాబా దిగుతూ కింద పడి బాలుడి మృతి

ములుగు , ఫిబ్రవరి 12: ఇంటి డాబా పైనుంచి నిచ్చెన ద్వారా దిగుతుండగా అది విరగడంతో కిందపడి బాలుడు మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలోని కడెకల్ గ్రామంలో చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యర్మ హరినాథ్, కృష్ణవేణి దంపతుల కుమారుడు యర్మ తేజ(9) స్థానిక పాఠశాలలో 4 వ తరగతి చదువుతున్నాడు.

ఉదయం ఇంటి వద్ద నిచ్చెన ద్వారా డాబా దిగుతూ అది విరగడంతో జారి కింద పడ్డాడు. తల్లిదండ్రులు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అక్కడ ఉన్నవారిని కలిచి వేసింది. బాలుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# మంద కృష్ణ మాదిగ మద్దతు కోరిన డాక్టర్ జీవీ

ఖమ్మం, ఫిబ్రవరి 12:(నేటినిజం ప్రతినిధి): ఎంఆర్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగని మర్యాద పూర్వకంగా కలిసిన డాక్టర్ జీవీ ఫౌండేషన్ ఫౌండర్ ప్రముఖ వైద్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు. ఈ సందర్బంగా డాక్టర్ జీవీ మాట్లాడుతూ...గడిచిన పదహారు సంవత్సరాలుగా తాను చేస్తున్న సేవలను, ఎంఆర్పిఎస్, ఎంఎస్ఎఫ్ చేసిన కార్యక్రమాలకు తాను ఇచ్చిన సహకరం జిల్లా నాయకులతో వున్న మంచి సంబంధాలు గురించి వివరించారు. అదేవిధంగా వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ పార్టీ నుండి ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగాలని ఆశిస్తున్నట్టు తెలియజేసి మంద కృష్ణ మాదిగ మద్దతు కోరారు. మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ...డాక్టర్ జీవీతో ఇరవై ఏళ్ల స్నేహం ఉందని మంచి వైద్యుడిగా బడుగు బలహీన వర్గాల కోసం పని చేస్తున్నారని మా ఎంఆర్పిఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు డాక్టర్ జీవీకి అండగా ఉండాలని మద్దతు తెలిపారు.

# కుటుంబసమేతంగా రామ్‌లల్లాను దర్శించుకున్న ఢిల్లీ, పంజాబ్ సీఎంలు



అయోధ్య, ఫిబ్రవరి 12: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ సింగ్ ఇవాళ కుటుంబ సమేతంగా అయోధ్య శ్రీరాముడిని దర్శించుకున్నారు. తల్లితండ్రులు, భార్యతో కలిసి కొత్తగా కొలువైన రామ్‌లల్లాను దర్శించుకున్నట్లు కేజ్రీవాల్ తన ట్వీట్‌లో తెలిపారు. ఇవాళ అయోధ్యకు చేరుకున్న రాముడి దివ్యదర్శనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. పంజాబ్ సీఎం భగవంత్ మాన్ కూడా తన కుటుంబంతో రాముడిని దర్శించుకున్నట్లు కేజ్రీ తెలిపారు. దర్శనం తర్వాత కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. చెప్పలేనటువంటి అనుభూతికి లోనైనట్లు ఆయన వెల్లడించారు. మనస్సు ప్రశాంతంగా మారినట్లు చెప్పారు. ప్రతి రోజూ లక్షల సంఖ్యలో భక్తులు వస్తుంటారని, వారిలో ఉన్న ప్రేమ, భక్తిని చూస్తుంటే మనస్సుకు సంతోషం వేస్తోందన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని రామ్‌లల్లాను ప్రార్థించినట్లు కేజ్రీ తెలిపారు.

# కేంద్రంలో 25 ఏళ్లు బిజెపి పాలన - జితేందర్ రెడ్డి



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 12: కేంద్రంలో 25 ఏళ్ల పాటు బిజెపి ఫలాన కొనసాగనుందని పార్లమెంటు మాజీ సభ్యుడు బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ .జితేందర్ రెడ్డి అన్నారు. మోదీ పాలనకు ముందు మోదీ పాలన తర్వాత చూసుకుంటే దేశంలో అభివృద్ధి ఎంతో మార్పు వచ్చిందని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి 370 స్థానాలు ఎన్డీఏ కూటమికి 400 ఎంపి స్థానాలు పక్కా రానున్నాయని అన్నారు.

నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొత్తం 543 ఎంపీ స్థానాలను బిజెపి 174 క్లస్టరుగా విభజించడం జరిగిందన్నారు. క్లస్టర్ వారిగా బస్సు యాత్ర లో ఈనెల 20 నుండి ప్రారంభించనున్నట్లు తెలిపారు .ఈ బస్సు యాత్రలకు జాతీయ రాష్ట్ర నాయకులు నాయకత్వం వహించి క్లస్టర్ స్థాయిలో బస్సు యాత్ర కొనసాగుతుందన్నారు. .20 నుండి జరగనున్న బస్సు యాత్రలో పార్టీ శ్రేణులు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని జితేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి

**-జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి .**

సంగారెడ్డి, ఫిబ్రవరి 12: (నేటినిజం ప్రతినిధి): ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని అర్హులైన జిల్లా ప్రజలు వినియోగించుకునేలా విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులకు ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారుల తో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం గురించి విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలనీ అధికారులను ఆదేశించారు.

ప్రధానమంత్రి విశ్వకర్మ ఓ సరికొత్త పథకమని దీని ప్రారంభించడంలో ముఖ్య ఉద్దేశం చేతివృత్తుల వారందరినీ కళా నైపుణ్యం కాలానుగుణంగా వారి ఉత్పత్తులు వాటి ప్రత్యేకతలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని అన్నారు .పి ఎం విశ్వకర్మ పథకంకు 18 రకాల చేతి వృత్తుల వారు అర్హులని తెలిపారు.

స్వయం ఉపాధిగా తమ తమ వృత్తిలో చేతి పనిముట్లు ఉపయోగిస్తూ జీవించేఇనుప పనిముట్లను చేసే కమ్మరి, వడ్రంగి , కంసాలి , చర్మకార వృత్తిలోని మోచీలు, వీధులలో తిరుగుతూ తాళాలు ఇతర మరమ్మత్తులు చేసేవారు, బీట కమ్మరి, బంగారు ,వెండి తయారు చేసే అవసలివారు, కుండలు చేసే కుమ్మరి, బుట్టలు అల్లె మేదరి వారు, ఇంటి నిర్మాణ పనులలో ఉండే ఉప్పరి వారు, పొరకలు తట్టలు చేసే ఎరుకలి వారు, బొమ్మలు చేసేవారు, చాకలి, మంగలి, పూలల్లే వారు, దర్జీ ఇంకా చేపలు పట్టే బెస్త కుల వృత్తులలో 18 ఏళ్ళు పైన బడిన వారు దరఖాస్తూ చేసుకోవాలని సూచించారు.

కామన్ సర్వీస్ సెంటర్లలో(అూఅ) తమ ఆధార్ కార్డ్ రేషన్ కార్డ్, బ్యాంకు పాస్ పుస్తకం మరియు ఆధార్ తో లింకు వున్న మొబైల్ ఫోను తీసుకుని వెళ్ళి తమ వివరములను నమోదు చేసుకోవాలనీ తెలిపారు.

అూఅ వివరాల కోసం గ్రామ పంచాయతీ సెక్రెటరీ / ఎంపీ ఓ / ఎంపీడీవో లను సంప్రదించాలని సూచించారు. గ్రామ పంచాయితీ స్థాయిలో పరిశీలించిన పిదప అర్హులైన వారి జాబితాను జిల్లా కమిటీ స్క్రూటీని చేసి, రాష్ట్ర కమిటీకి పంపడం జరుగుతుందని తెలిపారు.పి ఎం విశ్వకర్మ కు ఎంపిక అయిన వారికి టూల్ కిట్ ప్రోత్సాహకం కింద



రూ. 15,000/-,

పి ఎం విశ్వకర్మ డిజిటల్ గుర్తింపు కార్డ్, ధృవీకరణ పత్రం, శిక్షణ కాలంలో రోజుకు రూ. 500/- సైఫండ్, మార్కెటింగ్ లో సహాయ పడటం, బ్యాంకు నుంచి మొదటి విడతలో పూచీకత్తు లేని వ్యాపారభివృద్ధి రుణం ఒక లక్ష రూపాయల వరకు తీసుకుని 18 నెలలలో 5 శాతం వడ్డితో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రెండో విడతలో రుణం రూ.2 లక్షల వరకు తీసుకుని 30 నెలలలో చెల్లించాలని తెలిపారు.

ప్రత్యేక అధికారులు మరియు గ్రామ సెక్రెటరీలు పథకంపై విస్తృత ప్రచారం కల్పించి అర్హులైన వారందరూ దరఖాస్తూ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఈ పథకం కింద జిల్లా పరిశ్రమల కేంద్రం, ఎస్సీ ఎస్టీ ,బీసీ సంక్షేమ శాఖ లు, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మున్సిపాలిటీ, ఎం ఎస్ ఎం ఈ ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమల కేంద్రం, సంగారెడ్డి నందు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు .

ఈ అవకాశాన్ని ఔత్సాహిక అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం ప్రశాంత్ , బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, డిపిఓ, డి ఆర్ డి ఓ, కార్మిక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి-జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి, ఫిబ్రవరి 12 (నేటి నిజం ప్రతినిధి)జిల్లాలో ఫిబ్రవరి 28 నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఇంటర్ పరీక్షలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 28 నుండి మార్చి, 16 వరకు జరుగు ఇంటర్మీడియట్ పరీక్షలకు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

సంబంధిత అధికారులు సమన్వయంతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు 52 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 9:00 గంటల నుండి మ.12:00 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 36,153 మంది హాజరు కానున్నారని,అందులో ప్రథమ సంవత్సరం పరీక్షలకు 17,665 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం పరీక్షలకు 18,488 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రశ్న పత్రాల స్టోరేజ్ పాయింట్లు 17 ఏర్పాటు చేస్తున్నట్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్లు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ టీములను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ శాఖ గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధించాలని, పరీక్షా సమయంలో పరీక్షా కేంద్రాల ఏరియాలలో జీరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు గంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు.

విద్యార్థులు సకాలంలో పరీక్షలకు హాజరయ్యేలా పరీక్ష సమయానికి అనువుగా ఆర్టీసీ అధికారులు బస్సులను నడపాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో ఒక ఎ.ఎన్.ఎమ్ ను కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# బిఎంఎస్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి..

## -జిల్లా కన్వీనర్ పప్పుల సురేష్




రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 12: (నేటినిజం ప్రతినిధి): బి ఎం ఎస్ రాష్ట్ర 4 వ త్రై వార్షిక మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ పప్పుల సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక విద్యార్థి భవన్ లో బి ఎం ఎస్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా గోదావరిఖని లో ఈ నెల 17 మరియూ 18 తేదీ లలో జరిగే రాష్ట్ర మహాసభలకు కరీంనగర్ జిల్లా నుండి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్మికుల అభివృద్ధి జరగాలి అంటే అది కేవలం బి ఎం ఎస్ తో మాత్రమే సాధ్యం అని స్పష్టం చేశారు. భారత దేశం లో రాజకీయాలకు అతీతంగా ఉన్న ఏకైక కార్మిక సంఘం బి ఎం ఎస్ అని అన్నారు. మహాసభలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామన్నారు. 93%ఉన్న అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రభుత్వం ఆయా క్షేత్రంలో సంక్షేమ బోర్డు లను ఏర్పాటు చేయాలని తీర్మానం చేస్తామన్నారు. బిఎంఎస్ మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు పసుల శ్రవణ్, తొర్తి శ్రీనివాస్, గజ్జెల హరికాంత్, నక్క అరుణ్, ఎండి సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# యూట్యూబ్ ఛానల్ ఆధ్వర్యంలో ఉద్యమకారులకు సత్కారం



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 12: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఉద్యమ వీరుల యూట్యూబ్ ఆధ్వర్యంలో సోమవారం నేరెళ్ల తిరుమల గౌడ్, బొజ్జ కనకయ్య, యెల్ల పోశెట్టి, రిటైర్డ్ ఆలయ ఉద్యోగి నాగురి ప్రకాశంలను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ వివరాలను గత ప్రభుత్వంలో వారి ఉద్యమాన్ని గుర్తించకుండా నిరాదరణకు గురిచేసిన వైనాన్ని రికార్డు చేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఉద్యమకారులకి సముచితస్థానం, గౌరవం ఇవ్వకుండా తెలంగాణ వ్యతిరేక శక్తులను కూడగట్టి, నిర్బంధాలకు గురిచేసిన వైనంను వారి ఛానల్ ద్వారా తెలిపారు. అనంతరం సన్మాన గ్రహీతలు తెలంగాణ ఉద్యమ వీరుల యూట్యూబ్ ఛానల్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వరం మారింది.. ఓటమి గ్రహించారు..

## -సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వరం మారిందని.. ఓటమి గ్రహించారని.. అందుకే వైసీపీ అభ్యర్థులను సీఎం మారుస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన అనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌ను కాపీ కొడుతున్న ప్రధాని మోదీ.. బీజేపీకు 370 సీట్లు వస్తాయని ప్రచారం చేస్తున్నారని.. మోదీ, జగన్ ఇద్దరూ ఇద్దరే... పచ్చి మోసగాళ్లని.. దేశం, రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని దుయ్యబట్టారు. టీడీపీ.. బీజేపీతో పొత్తు పెట్టుకోవద్దని సూచించారు. చంద్రబాబును 53 రోజులు జైల్లో పెట్టడానికి జగన్‌కు బీజేపీ సహకరించిందని ఆరోపించారు.

దేశంలోని ప్రాంతీయ పార్టీలను ప్రధాని మోదీ విచ్చిన్నం చేస్తున్నారని రామకృష్ణ విమర్శించారు. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నాయకులు విచిత్రంగా పగలు ఒకరు.. రాత్రి ఒకరు మోదీని కలుస్తున్నారని అన్నారు. జార్ఖండ్ ముఖ్యమంత్రిని బ్లాక్‌మెయిల్ రాజకీయం చేసి అరెస్ట్ చేశారని.. ఏపీ సీఎం జగన్ రూ. లక్షలు కోట్లు దోపిడీ చేస్తే కేంద్రం పట్టించుకోదని.. బీజేపీ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. సీఎం జగన్ మరోసారి గెలువడానికి వాలంటీర్ వ్యవస్థను నమ్ముకుందని, ఏపీలో ఓటర్ల అవకతవకలు జరగడానికి ప్రధాన కారణం కలెక్టర్, ఎస్పీలు, వైసీపీ నాయకుల ప్రమేయమేనని ఆయన అన్నారు. దొంగ ఓట్లపై కేంద్ర రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు పిర్యాదు చేస్తామన్నారు. సీపీఐ పార్టీ వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలనేది మార్చి మొదటి వారంలో తమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ పార్టీని ఓడించడమే తమ లక్ష్యమని, ఆ పార్టీతో పోరాడటానికి మేము సిద్దమని.. అందుకు ఏ పార్టీతోనైనా సీపీఐ కలుస్తుందని రామకృష్ణ స్పష్టం చేశారు.

# ఒకే దేశం-ఒకే చట్టం-ఒకే ఎన్నిక చట్టాలు సమాఖ్య వ్యవస్థకే ముప్పు

## - సిపిఐ ( యం ఎల్) చంద్రుపుల్లారెడ్డి కేంద్ర కమిటీ

హైదరాబాద్ ఫిబ్రవరి 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశంలో నిరంకుశ పోకడలు వల్లా దళిత,ఆదివాసీ,ముస్లిం,క్రిస్టియన్. వర్గాలు ,తాము పుట్టిన గడ్డపైనే కాందిశీకులు,బీజేపీ కి భయపడి బ్రతుతున్నరని మల్లేపల్లి ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు నిరుద్యోగం, మహిళా లపై దాడులు, ఫాసిస్టు హిందుత్వ ముకాల హింసా ప్రజా హక్కుల నిర్వీర్యం, చట్టబద్దమైన సంస్థలను నిర్వీర్యం గవించడం,సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడువడం సామాజిక న్యాయం వంటి పేదలకు అందని ద్రాక్షగా మిగిలిందని విమర్శించారు.భారతీయ న్యాయ సనీహిత' ,భారతీయ నగరిక్ సురక్షా సంహిత ' ,భారతీయ సాక్ష్యం" పేర్లతో తీసుకొచ్చిన చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు.అనుమానం ఆధారంగా అరెస్టులు చేసేందుకు, శాంతియుత నిరసనలు ఉగ్రవాద నిర్వచనం పరిధిలో చేర్చెందు కే వీటిని వెన్నకి తీసుకోవాలన్నారు.యు ఏ పి ఎ" జమ్ము కాశ్మీర్ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్" వంటి క్రూరమైన చట్టాలను రద్దు చేయాలి, అంతరంగిక ఘర్షణల పరిష్కారానికి సాయుధ బలగాలను ఆపాలి, పిడి యాక్ట్ ను యుద్ద పరిస్థితుల తప్ప వినియోగించారాదని 1951 లో కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయాలని,ఎంఎస్ పి కి చట్టబద్దత వైన గ్యారెంటీ ఇవ్వాలని,ఇందుకు సంబంధించిన స్వామినాథన్ కమి షన్ చేసినా సిఫార్సులను తప్పక పాటించాలి, వంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించాలని,పిడిఎఫ్, ఏండి ఏం ఎస్, ఐసి డీ ఎస్ కోసం విభిన్న ఆహార పంటలను సేకరించి, వాటికి కూడా యం ఎస్ పి ని వర్తిసీపచేయలని డిమాండ్ చేసారు.1947 కి ముందున్న ప్రాతన స్థలాల చట్టానికి ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలి,జాతి,మతం,కులం,లింగం,వైకల్యం,యుగాలలో పౌరుల పట్ల వివక్షత తావులేకుండా చేసేందుకు ఒక సమగ్ర చెట్టన్ని తీసుకురావాలి ఒక కమిష్ ను ఏర్పాటు చేయాలని,వివక్షపురిత ( సి ఏ ఏ) ని రద్దు చేయాలని,స్వతంత్ర నిజ నిర్ధారణ బృందాలకు మీడియా సంస్థలకు స్వేచ్చ నివ్వాలని,ఎన్నికల సంఘం, సీబిఐ, ఇడీ,స్వయం ప్రతిపత్తి ని పునారిద్దించలి,అఖిల భారత న్యాయ సేవా కేంద్రం ను ఏర్పాటు చేయాలని,తక్షణమే జమ్మూకాశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్దరించని,గత దశబ్దంలో ప్రవేశపెట్టిన పాఠ్య పుస్తకాల్లోని బ్రాహ్మణీయ,మతపరమైన అంశాలను తొలగించాలని,మణిపూర్ కు పౌర సమాజ ప్రతినిధులతో కుడినా నిజా నిర్దారణ కమిషన్ ను పంపాలని, ఆదివాసీ హక్కుల( అటవీ హక్కుల గుర్తింపు) చట్టం 2006 ప్రకారం కమ్యూనిటీ అటవీ హక్కుల ను అమలను అమలు చేయాలని,ఈ చట్టానికి తూట్లు పొడుస్తూ 2023 లో తీసుకొచ్చిన సవరణను రద్దుచేయాలని,ఉపాధి హామీని విస్తరించి, బలోపేతం చేయాలి ,బలోపేతం చేయాలి,రోజు కులిని రూ 500 కు,పెంచాలని,మహిళా కార్మికుల కోసం ప్రత్యేకంగా పట్టణ ఉపాధి హామిని ఏర్పాటు చేయాలని,యువత ఉపాధి కోసం ప్రత్యేక ప్యేకేజేలను అందించాలని,శ్రామిక ప్రజల అన్ని విభాగాలకు ప్రదనా కర్మిక ( ఏ వ రా ణ ా ల న ు ) నిర్ధారించడానికిఅగ్రిగేటర్లు,ప్రభుత్వం కార్మికులతో (సంఘాలతో) ఒప్పందాలు చేసుకోవాలని,ఎలాంటి వివక్ష లేకుండా ఆరోగ్యాని మానవ హక్కు గా గుర్తించాలని,సిపిఐ(యం ఎల్) చనీద్ర పుల్లా రెడ్డి కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది.

# పెద్దవంగర ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

## -అధ్యక్షుడిగా కందుల శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా పల్లపు శ్రీనివాస్.

## -కోశాధికారిగా సూదగాని యాకయ్య



మహబూబాబాద్:మండల ప్రెస్ క్లబ్ కమిటీని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని పెద్దవంగర మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కందుల శ్రీశైలం అన్నారు. ఆదివారం మండల ప్రెస్ క్లబ్ లోని విలేకరుల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బోగోజు భద్రయ్యా చారి, అధ్యక్షుడిగా కందుల శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా తాళ్లపల్లి నవీన్, రాయారపు రాజు, ప్రధాన కార్యదర్శిగా పల్లపు శ్రీనివాస్, కోశాధికారిగా సూధగాని యాకయ్య, ప్రచార కార్యదర్శిగా చింతల ఐలయ్య, తులసి వేణు, ముఖ్యసలహాదారులుగా గుళ్ళపల్లి సదానందం, పానుగోతు బాలాజీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ కమిటీ ఎన్నికకు సహకరించిన తోటి మిత్రులకు , మాపై నమ్మకంతో... ఈ భాధ్యతలను అప్పగించిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు . సంయుక్తంగానే కమిటీ అభివృద్ధి సాధ్యమని, దానికి కార్యవర్గమంతా చేయూతనివ్వాలని కోరారు. విలేకరుల సమస్యల పట్ల నిర్వీరామంగా పోరాడుతామన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. ఈ కమిటీ ఎన్నికలో విలేకరులు జాటోత్ సుధాకర్, కుమ్మరి రాంమ్మూర్తి, ,యాసారపు భాస్కర్, జలగం శ్రీనివాస్, గంగారపు మధు, తాళ్లపల్లి మల్లేష్,దుర్గొజు రాజశేఖర్, డోనాల రత్నాకర్ రెడ్డి, చెరుకు సత్యం, యాసారపు సతీష్, వెలిశాల శ్యామ్ తదితరులు ఉన్నారు.

# భీమ్ నగర్ కాలనీలో విషాదం.. ఇంటి గోడ కూలి ముగ్గురికి తీవ్ర గాయాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 12: శిథిలావస్థలో ఉన్న ఓ ఇంటిని కుల్చుతుండగా ఇంటి గోడ కూలి మీదపడటంతో ముగ్గురు తీవ్ర గాయాలయ్యాయి.

ఈ విషాదకర సంఘటన కుల్సుంపురా పోలిస్ స్టేషన్ పరిధిలోని పురానాపుల్ భీమ్ నగర్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. అహ్మద్, ఐజాజ్‌తో పాటు అక్కడే నిలబడి ఉన్న మరో వ్యక్తి పై గోడ పడడంతో తీవ్రంగా గాయపడ్డారు.

ఆ ముగ్గురిని వెంటనే స్థానికులు ఒస్మానియా దవాఖానకు తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఇంటి యజమాని శివ రాజ్ ఎలాంటి సేఫ్టీ చర్యలు తీసుకోకపోవడం వల్లో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. సమాచారం అందుకున్న కుల్సుంపురా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

# ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ మిగులు పనులు త్వరగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్



ఖమ్మం, ఫిబ్రవరి 12:(నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ మిగులు పనులు త్వరితగతిన పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. సోమవారం కలెక్టర్, రూ. 34 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పెయింటింగ్ పనులు చివరి దశలో ఉన్నట్లు, శానిటేషన్ పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు. మిగులు డోర్ల పనులు, విద్యుద్దీకరణ, ఇతరత్రా పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రికి చేరుకున్న సామాగ్రిని ఆయన పరిశీలించారు. ఆసుపత్రికి రావాల్సిన పరికరాలు, కావాల్సిన వరికరాల నివేదిక సమర్పించాలన్నారు. అనంతరం మినీ స్టేడియంను సందర్శించి పరిశీలించారు. మిగులు పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్, క్రికెట్ పిచ్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. లాంగ్ జంప్ కోర్ట్, అవుట్ డోర్ ఖోఖో కోర్ట్ పనుల్లో వేగం పెంచాలన్నారు. ప్రభుత్వ కళాశాల, డిగ్రీ కళాశాలలో శిథిలావస్థలో ఉన్న భవన కూల్చివేత చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, డిసిహెచ్ఎస్ డా. వెంకటేశ్వర్లు, జిల్లా యువజన సంక్షేమ, క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, ఆరోగ్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, డిఇ విద్యాసాగర్, వైద్యాధికారులు, తదితరులు ఉన్నారు.

# వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల దరఖాస్తులకు ఆహ్వానం

హైదరాబాద్, ఫిబ్రవరి 12: కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 2023-24 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ సుకన్య పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులను ఫిబ్రవరి 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ కళాశాల ఆఫీసులో దరఖాస్తు చేసుకోవలసిందిగా సూచించారు. అర్హులైన అభ్యర్థులకు 17వ తేదీన ఉదయం 11 గంటలకు కాలేజీ ప్రాంగణంలోనే ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. పొలిటికల్ సైన్స్-1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్-1 మొత్తం కలిపి రెండు పోస్టులు ఉన్నట్లు పేర్కొన్నారు.

అభ్యర్థులకు పీజీలో మినిమం 55 శాతం మార్కులు (50 శాతం ఎస్సీ/ఎస్టీలకు) వచ్చి ఉండాలి. సంబంధిత సబ్జెక్టులో పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. పీహెచ్‌డీ అభ్యర్థులు లేని పక్షంలో నెట్/సెట్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. వీరు కూడా లేని పక్షంలో పీజీ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. బోధనానుభవం కలిగిన వారికి వెయిటేజి ఇస్తారు. వీరు తమ సర్వీస్ సర్టిఫికెట్ సమర్పించాలి. అయితే అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెటలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

# కరాటే పోటీలలో సీఎస్కేఐ క్రీడాకారులకు పతకాలు




కరీంనగర్, ఫిబ్రవరి 12: ఈ నెల 9,10,11వ తేదీలలో విశాఖ పట్నంలోని పోర్ట్ ఇండోర్ స్టేడియంలో జరిగిన నీజి షోటోకాన్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ కరాటే పోటీలలో నగరానికి చెందిన కాంటినెంటల్ షోటోకాన్ కరాటే దో ఇండియా నేషనల్ అకాడెమి నుండి 8 మంది క్రీడాకారులు పాల్గొని, 16 పతకాలతో పాటు బెస్ట్ టీమ్ కప్ అందుకున్నారు. కటా కుమిటి విభాగాలలో కే పావని 2 గోల్డ్, పి శ్రీనిధి గోల్డ్, సిల్వర్, జి అనన్య గోల్డ్, సిల్వర్, వై విశ్వక్ సేన్ గోల్డ్, బ్రాంజ్, వి శ్రేయాస్ 2 బ్రాంజ్, ఏం వగ్మాయి 2 గోల్డ్, పి శ్రేయాన్స్ నారాయణ్ గోల్డ్, సిల్వర్, ఏం శ్రేయావ్స్, గోల్డ్, బ్రాంజ్ లు సాధించినట్లు సీఎస్కేఐ ఇండియా చీఫ్ అండ్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షిహన్ ఇ శ్రీనివాస్ తెలిపారు. 14 రాష్ట్రాల నుండి నుండి సుమారు 1000 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పతకాలు, గ్రాండ్ ఛాంపియన్ షిప్ సాధించిన క్రీడాకారులను సీఎస్కేఐ ఛైర్మన్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్యదర్శి మాడుగుల ప్రవీణ్, కోశాధికారి వంగల శ్రీధర్, ఉపాధ్యక్షులు పెద్ది సందీప్ లు అభినందించారు.

# చలో నల్లగొండ ఎఫెక్ట్.. బీఆర్ఎస్ ఒత్తిడితో అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టనున్న కాంగ్రెస్: కేటీఆర్

హైదరాబాద్: బీఆర్ఎస్ ఒత్తిడితోనే కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించట్లేదని అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (ఖుఖీ) అన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పడానికి నిరసనగా రేపు నల్లగొండలో బీఆర్ఎస్ తలపెట్టిన 'చలో నల్లగొండ' సభ వల్లే కాంగ్రెస్‌లో చలనం వచ్చిందని తెలిపారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్‌కు దక్కిన మొదటి విజయంగా భావిస్తున్నామని సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్)లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

# తాతయ్య జ్ఞాపకార్థకం గ్రామానికి బెంచీలు బహుకరణ



జనగాం, ఫిబ్రవరి 12: కొడకండ్ల మండలంలోని నర్సినీగాపురం గ్రామంలో నూనెముంతల బాలరాజు గౌడ్ జ్ఞాపకార్థం గ్రామంలో ఆయన పెద్దమనవడు రావుల సత్యనారాయణ 12 బెంచీలు గ్రామంలో వివిధ ప్రదేశాల్లో కూర్చోవడానికి గ్రామానికి డొనేట్ చేయడం జరిగింది. అందుకు గ్రామస్తులు అందరూ ఆయనను అభినందించి ఇలాంటి స్వచ్ఛంద సేవా కార్యకలాపాలు ముందు ముందుగా ఇంకెన్నో చేయాలని గ్రామస్తులు మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కప్పల రంగయ్య, నూనెముంతల సోమనర్సయ్య, నూనెముంతల మల్లేశం, కప్పల లింగయ్య, పనస శీను, నూనెముంతల యాకయ్య, కొండ అంజయ్య, నూనెముంతల సోమయ్య ,దేశగాని సతీష్, కప్పల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# 14, 15 తేదీల్లో 26 వేల పెళ్లిళ్లు.. శాసనసభకు సెలవు ఇవ్వాలని మల్లారెడ్డి రిక్వెస్ట్

హైదరాబాద్, ఫిబ్రవరి 12: మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఓ చిన్న రిక్వెస్ట్ చేశారు. కృష్ణా ప్రాజెక్టులపై చర్చ సందర్భంగా మల్లారెడ్డి ఈ రిక్వెస్ట్ చేశారు. అదేంటంటే.. నాదేం లేదు.. ఒక్కటే నిమిషం.. ఒక్కటే సెకండ్. ఒక రిక్వెస్ట్ చేస్తున్నా.. 14, 15 తేదీల్లో వసంత పంచమి ఉంది కాబట్టి.. 26 వేల పెళ్లిళ్లు ఉన్నాయి. కాబట్టి సభ్యులందరి కోరిక మేరకు ఆ రెండు దినాలు సభ పెట్టొద్దని మా రిక్వెస్ట్ అని మల్లారెడ్డి తన ప్రసంగాన్ని ముగించేశారు. దీంతో సభాపతితో పాటు సభ్యులు నవ్వారు.

# సీఎం సహాయనిధి నిరు పేదలకు వరం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మన్సూరాబాద్, ఫిబ్రవరి 12: పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి ఎంతో తోడ్పాటునందిస్తుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు.

నాగోల్ డివిజన్ బండ్లగూడ పరిధి లలితానగర్‌కాలనీకి చెందిన లావణ్య వెన్నుముఖ సమస్యతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానలో వైద్య పరీక్షలు చేయించుకుంది. వెన్నుముఖ ఆపరేషన్ చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో విషయాన్ని ఆమె కుటుంబసభ్యులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి సీఎం సహాయనిధి నుంచి రూ. 1.50 లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించారు. సదరు ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి పథకం పేదలకు వరం లాంటిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పాటి చిరంజీవి, సత్యంచారి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published andowned by VEENADAS, at
Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar,
Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,
Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
**RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com